ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 135 ఆదివారం 03 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 135 Sunday 03 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## ఈ నెల 4న తెలంగాణ కేబినెట్ భేటీ

- పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం
- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన భేటీ కానున్న రాష్ట్ర మంత్రివర్గం
- మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో సమావేశం
- పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం
- తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు నాలుగు మార్గాలు ప్రతిపాదనలో ఉన్నాయి
- పెండింగ్‌లో పెండింగ్ బిల్లులు 100 రోజుల్లో క్లియర్ చేయాలని భావిస్తున్న ప్రభుత్వం



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 02 :**
రాష్ట్ర మంత్రివర్గం ఎల్లుండి సమావేశం కానుంది. సచివాలయంలో ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ జరగనుంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీపై కేబినెట్ చర్చించనున్నట్లు తెలుస్తోంది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు నాలుగు మార్గాలు ప్రతిపాదనలో ఉన్నాయి. వీటిపై కేబినెట్ చర్చించి, నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ఉద్యోగులు, ఫించనర్ల సమస్యలు, డిమాండ్లపై మంత్రి మండలి - మిగతా 2 లో

## తెలంగాణలో భారీగా పెరగనున్న మద్యం ధరలు!

- తెలంగాణలో మద్యం ధరలను పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు
- ప్రీమియం బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై రూ.100 వరకు పెంపు అవకాశం
- పెరిగిన ఉత్పత్తి వ్యయంతో కంపెనీల నుంచి వస్తున్న ఒత్తిడి
- ధరల నిర్ధారణకు ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు
- ఈ పెంపుతో ప్రభుత్వానికి ఏటా రూ.3000 కోట్ల అదనపు ఆదాయం అంచనా



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 02 :**
తెలంగాణలో మద్యం ప్రియులకు త్వరలో షాక్ తగలబోతోంది. రాష్ట్రంలో మద్యం ధరలను పెంచేందుకు ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. పెరిగిన ఉత్పత్తి వ్యయం, డిస్టలరీల నుంచి వస్తున్న ఒత్తిళ్ల నేపథ్యంలో ఈ నెలలోనే కొత్త ధరలపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ పెంపు అమలైతే ప్రీమియం బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై రూ.100 వరకు భారం పడొచ్చని అంచనా. గత ఏడాది కాలంగా మద్యం తయారీ కంపెనీలు ధరల పెంపు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా - మిగతా 2 లో




2 లో

## కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదు

- ప్రజలు మరో 20 ఏళ్లు కాంగ్రెస్‌కు ఓటు వేయరు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి బాగా పెరిగిపోయిందని ఆరోపణ
- కాంగ్రెస్ అరాచకాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని మండిపాటు
- బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్న కేటీఆర్

## ఇజ్రాయెల్ గూఢచారులని ఇద్దరిని ఉరితీసిన ఇరాన్



2 లో

- యాకూబ్ కరీంపూర్, నాసర్ బెకర్జాదే అనే వ్యక్తులకు మరణశిక్ష అమలు
- టెలిగ్రామ్, వాట్సాప్ ద్వారా సైనిక, ప్రభుత్వ సమాచారాన్ని పంపినట్టు ఆరోపణలు
- ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్‌తో జరిగిన యుద్ధ సమయంలో వీరు సహకరించినట్టు వెల్లడి

## తృణమూల్ కాంగ్రెస్ 200 సీట్లు గెలుచుకుంటుంది

- బెంగాల్‌లో బీజేపీ గెలుస్తుందన్న ఎగ్జిట్ పోల్స్
- స్పందించిన మమతా బెనర్జీ
- ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను తోసిపుచ్చిన మమతా బెనర్జీ
- తృణమూల్ కాంగ్రెస్ 200 సీట్లు గెలుచుకుంటుందని ధీమా
- టీఎంసీ కార్యకర్తలపై కేంద్ర బలగాలు దాడులు చేస్తున్నాయని ఆరోపణ



**వార్త సంధ్య,కోల్‌కాతా , మే 02 :**
పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం సాధిస్తుందన్న ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ స్పందించారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలను ఆమె తోసిపుచ్చారు. కౌంటింగ్ ఏజెంట్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ, టీఎంసీ తప్పకుండా ఘన విజయం సాధిస్తుందని ధీమా - మిగతా 2 లో

## కాకతీయ మెగా పార్క్‌ను ప్రారంభించనున్న ప్రధాని

- ఈ నెల 10న వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభం
- హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- రూ.6,000 కోట్లకు పైగా పెట్టుబడులు.. 24,400 మందికి ఉపాధి అంచనా
- 1,327 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటిగా నిర్మాణం
- 'ఫామ్ టు ఫారెన్' (5F) లక్ష్యంతో ప్రాజెక్టు రూపకల్పన



**వార్త సంధ్య, వరంగల్ , మే 02 :**
తెలంగాణలోని వరంగల్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 10వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ ఈ పార్క్‌ను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఇవాళ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. హైదరాబాద్ నుంచి ప్రధాని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ప్రపంచ స్థాయి సమీకృత టెక్స్‌టైల్ హబ్‌గా ఈ పార్కును తీర్చిదిద్దినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఈ పార్కు ద్వారా టెక్స్‌టైల్ తయారీ, ఉపాధి, ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ '5ఫీ' (ఫామ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారెన్) దార్శనికతకు అనుగుణంగా టెక్స్‌టైల్ విలువ గొలుసును బలోపేతం చేసేందుకు ఈ పార్కును అభివృద్ధి చేసినట్లు వివరించారు. దాదాపు 1,327 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకున్న ఈ పార్కు దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 1,695.54 కోట్లు కాగా, దీని ద్వారా రూ. 6,000 కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రూ. 3,800 కోట్లకు పైగా పెట్టుబడులు ఖరారైనట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. పార్కులోని 62 శాతం స్థలాన్ని యాంకర్ ఇన్వెస్టర్లకు కేటాయించినట్లు తెలిపారు. ఈ మెగా ప్రాజెక్టు - మిగతా 2 లో



2 లో

## వాట్సాప్ వేదికగా వైద్య సేవలు

- ఏపీ ప్రభుత్వ సరికొత్త అడుగు
- మనమిత్ర సేవలను అందుబాటులోకి తెచ్చిన ఏపీ ప్రభుత్వం
- డిజిటల్ సేవల విస్తరణలో భాగంగా కీలక నిర్ణయం
- వాట్సాప్ ద్వారా వైద్య సేవలను, సమాచారాన్ని సులభంగా పొందే అవకాశం

## ఇరాన్ ఆర్థిక మూలాలపై అమెరికా దెబ్బ

- దిగ్బంధనంతో 5 బిలియన్ డాలర్ల నష్టం!
- గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో అమెరికా దిగ్బంధనంతో ఇరాన్‌కు తీవ్ర ఆర్థిక నష్టం
- చమురు అమ్మకాల ద్వారా వచ్చే దాదాపు 5 బిలియన్ డాలర్ల ఆదాయం కోల్పోయిన ఇరాన్
- సుమారు 53 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురుతో 31 ట్యాంకర్లు సముద్రంలో నిలిచిపోయిన వైనం




2 లో



## పవన్ కల్యాణ్ ను పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- గత కొంతకాలంగా పవన్ కు అనారోగ్య సమస్యలు
- ఇటీవలే హైదరాబాద్‌లో శస్త్రచికిత్స
- హైదరాబాద్‌లోని పవన్ నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన చంద్రబాబు
- శస్త్రచికిత్స నేపథ్యంలో తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచన
- తన నివాసానికి వచ్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన పవన్

**వార్త సంధ్య, అమరావతి, మే 02 :**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి - మిగతా 2 లో



2 లో

## ప్రధాని మోదీపై షర్మిల ఫైర్

- వాణిజ్య గ్యాస్ ధరల పెంపుపై ప్రధాని మోదీపై షర్మిల ఫైర్
- ఎన్నికల తర్వాత ప్రజలపై భారం మోపడం మోదీకి అలవాటు
- ఒకేసారి రూ. 993 పెంచి సామాన్యుల నడ్డి విరిచారని ఆరోపణ
- పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

## ఆంధ్రప్రదేశ్‌లో పుట్టపర్తి దశ మార్చనున్న డీఆర్‌డీవో

- రూ.15,000 కోట్లతో యుద్ధ విమానాల తయారీ కేంద్రం
- శ్రీసత్యసాయి జిల్లాలో రూ.15,000 కోట్లతో డీఆర్‌డీవో భారీ ప్రాజెక్ట్
- పుట్టపర్తిలో ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటు
- ఈ నెల 15న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపనకు సన్నాహాలు
- రక్షణ, ఏరోస్పేస్ హబ్‌గా వేగంగా మారుతున్న శ్రీసత్యసాయి జిల్లా
- బెంగళూరుకు సమీపంగా ఉండటంతో జిల్లాకు పెరుగుతున్న ప్రాధాన్యత



**వార్త సంధ్య, అమరావతి, మే 02 :**
ఏపీలో ఏరోస్పేస్, రక్షణ రంగం పరుగులు పెట్టనుంది. రాష్ట్రానికి మరో భారీ ప్రాజెక్ట్ రాబోతోంది. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏకంగా రూ.15,000 కోట్ల పెట్టుబడితో ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డీఆర్‌డీవో (రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ) ముందుకు వచ్చింది. ఈ నెల 15న సీఎం చంద్రబాబు ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు రాకతో శ్రీసత్యసాయి జిల్లా దేశ రక్షణ రంగ పటంలో కీలక స్థానాన్ని సంపాదించనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) మోడల్ యుద్ధ విమానాలను తయారు చేయనున్నారు. దేశీయంగా, అత్యాధునిక సాంకేతికతతో రూపొందించే ఈ విమానాలను భారత వైమానిక దళం, నౌకాదళం కోసం వినియోగిస్తారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న సుఖోయ్ ఎస్‌యూ-30 యుద్ధ విమానాలకు ప్రత్యామ్నాయంగా వీటిని అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 600 ఎకరాల భూమిని డీఆర్‌డీవోకు కేటాయించింది. భవిష్యత్ అవసరాల - మిగతా 2 లో

# సంపాదకీయం

## వాణిజ్య లబ్ధి..!



న్యూజిలాండ్‌తో భారతదేశం కుదుర్చుకున్న స్వేచ్ఛావాణిజ్య ఒప్పందంమీద పలు అనుమానాలు, విమర్శలు ఉన్నప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఈ తరహా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలకు ఇది కొనసాగింపు. దేశాలన్నీ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీవో) నియమ నిబంధనలకు లోబడి చేసుకొనే వ్యాపారానికి పలుకారణాల రీత్యా ఉల్లంఘనలు, వ్యతిరేకతలతో ఆ వ్యవస్థ బలహీనపడుతున్న తరుణంలో, ఓ రెండు దేశాలు తమ అవసరాలు, ప్రయోజనాలకు లోబడి కొన్ని రంగాలకు మాత్రమే పరిమితమైన ఎఫ్‌టీఏలను కుదుర్చుకోవడం పెరిగింది. కేవలం ఐదువిడతల చర్చలతో, తొమ్మిది నెలల్లోనే భారత్‌న్యూజిలాండ్ ఈ ఒప్పందానికి రావడం విశేషం. భారత్ అతివేగంగా కుదుర్చుకున్న ఎఫ్‌టీఏల్లో ఇదీ ఒకటి. న్యూజిలాండ్ పార్లమెంట్ ఆమోదంతో ఈ ఏడాదిలోనే అమలులోకి రాబోతున్న ఈ స్వేచ్ఛావాణిజ్యాన్ని ఉభయదేశాలు చరిత్రాత్మకమైన ముందడుగుగా అభివర్ణించాయి. దిగుమతి సుంకాన్ని న్యూజిలాండ్ పూర్తిగా రద్దుచేయడం వల్ల భారత వ్యవసాయ ఉత్పత్తులు, మందులు, తోలు, ఆభరణాలు, వస్త్రాలు తదితర రంగాలు లాభపడతాయి. సిరామిక్స్, కార్పెట్లు, ఆటోమొబైల్ విడిభాగాల ఎగుమతులు జోరందుకుంటాయి. వీసా నిబంధనల్లో మూడేళ్ళ మినహాయింపుతో ఐటీ, హెల్త్‌కేర్, ఇంజనీరింగ్ రంగాల్లో భారతీయ నిపుణులకు న్యూజిలాండ్‌లో తాత్కాలిక ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయట. న్యూజిలాండ్ మద్యం పరిమిత సుంకంతో భారత్‌కు దిగుమతి అయితే, ఇక్కడ తయారైన వైన్ సుంకాలు లేకుండా అక్కడకు ఎగుమతి అవుతుంది. ఇక, దాదాపు అరవైశాతం న్యూజిలాండ్ ఉత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాలను సున్నా చేసింది. గొర్రె మాంసం, ఉన్ని, బొగ్గు, కలప ఉత్పత్తులు వంటివి అందులో కొన్ని. యాపిల్, కివి, అవకాడో, బ్లూబెర్రీ వంటి పండ్లు, తేనె, కొన్ని రకాల పాల ఉత్పత్తులు మంచి రాయితీతో దిగుమతి అవుతాయి. రాబోయే ఏడేళ్ళలో సముద్ర ఉత్పత్తులపై మనం భారీ రాయితీలు ఇవ్వాల్సి ఉందట. ఈ ఎఫ్‌టీఏతో ఇరుదేశాల మధ్య వస్తుసేవల వాణిజ్యం ఐదు బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. ఈ ఒప్పందంతో మన రైతులు, యువత, మహిళలు, ఎంఎస్‌ఎంఈలు, చేతివృత్తుల నిపుణులు, స్టార్టప్ కంపెనీలు, నవీన ఆవిష్కర్తలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రధాని సంతోషిస్తున్నారు. ఇక్కడి రైతుల, చిన్నతరహా పరిశ్రమల ప్రయోజనాలకు నష్టంచేకూర్చే అంశాలు ఇందులో లేవని ప్రభుత్వం చెబుతోంది. 140కోట్ల మంది భారతీయులకు న్యూజిలాండ్‌కు చెందిన పలురకాల ఉత్పత్తులను అందించగలిగే అద్భుత అవకాశం తమకు దక్కిందని, అనేక రంగాలకు చెందిన తమ ఉత్పత్తిదారులకు ఈ ఒప్పందంతో ప్రయోజనం చేకూరుతుందని ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ ఆనందిస్తున్నారు. ఇక, భారత ప్రభుత్వం వివరణలు ఇచ్చినా ఈ ఒప్పందంపై విమర్శలు తప్పడం లేదు. దేశ పాడిపరిశ్రమకు, మరీ ముఖ్యంగా యాపిల్ రైతులకు హానికరమైన రీతిలో ఈ ఒప్పందం జరిగిందని ఏఐకేఎస్ వంటివి విమర్శిస్తున్నాయి. ముఖ్యంగా సున్నా సుంకంతో న్యూజిలాండ్ యాపిల్ దిగుమతి కావడం వల్ల, దేశంలో యాపిల్ ఉత్పత్తిమీద ఆధారపడిన లక్షలాది రైతు కుటుంబాలు దెబ్బతింటాయనీ, న్యూజిలాండ్ అధికారులు తమ దేశంలో చేస్తున్న ప్రకటనల ప్రకారం 80శాతం ఉత్పత్తులు భారత్‌లోకి కారుచవుకగా ప్రవేశిస్తాయని ఆ సంఘాల ఆరోపణ. ఒప్పందానికి సంకల్పించడం నుంచి సంతకాలు చేయడం వరకూ సాగే మొత్తం ప్రక్రియలో ఏ దశలోనూ వివరాలు బయటకు తెలియకపోవడం ఇటువంటి వాదనలకు తావిస్తుంది. ఒప్పందంపై సంతకాలు జరిగిన అనంతరం కూడా పూర్తి సమాచారం వెల్లడికాకపోతే మరోదేశం పాలకులు, అధికారులు, మీడియా ప్రచారం చేసే అంశాలకు విలువ, విశ్వాసం ఏర్పడతాయి. యూరోపియన్ యూనియన్, యూకె వంటి పెద్ద పెద్ద భాగస్వాములతో వాణిజ్య ఒప్పందాల కోసం ఏళ్ళతరబడి మంతనాలు సాగడం తెలిసిందే. అమెరికాతో అయితే వ్యవహారం ఇప్పటికీ కొలిక్కిరాలేదు. తాము చొచ్చుకుపోయేందుకు వీలుగా భారతదేశం తన మార్కెట్ పూర్తిగా తెరిచి ఎర్రతివాచీతో స్వాగతం పలకాలని ఈ పెద్దదేశాలు దబాయిస్తుంటాయి. మారిషస్, అరబ్ ఎమిరేట్స్, ఒమాన్ వంటి దేశాలతో ఇటీవల కుదిరిన ఎఫ్‌టీఏలు పరిమాణం రీత్యా పెద్దవి కాకున్నా వాణిజ్యం కోసం మనం పెద్దదేశాల మీద ఆధారపడే అవసరాన్ని తగ్గిస్తాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దెబ్బకు ప్రపంచ వాణిజ్యక్రమం మారిపోతున్న తరుణంలో ఇటువంటి ఎఫ్‌టీఏలు తప్పడం లేదు.

## పవన్ కల్యాణ్ ను పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి – తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం చంద్రబాబు జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసానికి వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్, ఆయన భార్య అనా కొణిదెల సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడే వరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని పవన్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు కాసేపు సమావేశమై రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై క్లుప్తంగా చర్చించుకున్నట్లు సమాచారం. తన ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాకతీయ మెగా పార్క్‌ను ప్రారంభించనున్న ప్రధాని

మొదటిపేజీ తరువాయి – పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత 24,400 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని అంచనా. ఇప్పటికే దాదాపు 2,000 ఉద్యోగాలు సృష్టించబడ్డాయని కిషన్ రెడ్డి తెలిపారు. అంతర్గత రోడ్లు, వీధి దీపాలు వంటి పనులు పూర్తయ్యాయని, 232 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, 12 మీణ నీటి సరఫరా వ్యవస్థ, వ్యర్థ జల శుద్ధి ప్లాంటు (జజుూ) వంటి కీలకమైన మౌలిక సదుపాయాల పనులు చివరి దశలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో పీఎం మిత్ర పార్కులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. తెలంగాణలోని వరంగల్‌తో పాటు తమిళనాడు, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలలో ఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నారు.

## తృణమూల్ కాంగ్రెస్ 200 సీట్లు గెలుచుకుంటుంది

మొదటిపేజీ తరువాయి – వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ 200కు పైగా సీట్లు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని, 2021, 2024లోనూ అలాగే చేశాయని అన్నారు. స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేయడానికే ఎగ్జిట్ పోల్స్ తప్పుడు ప్రచారాలని ఆరోపించారు. ఇప్పుడు కూడా అదే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. టీఎంసీ కార్యకర్తలపై కేంద్ర బలగాలు దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక వారి సంగతి చూస్తామని హెచ్చరించారు.

## ఇరాన్ ఆర్థిక మూలాలపై అమెరికా దెబ్బ

మొదటిపేజీ తరువాయి – గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో అమెరికా నేతృత్వంలో కొనసాగుతున్న కఠినమైన దిగ్బంధనం కారణంగా ఇరాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ఈ ఆంక్షల వల్ల ఇరాన్ చమురు అమ్మకాల ద్వారా పొందాల్సిన దాదాపు 5 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోయిందని అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) అంచనా వేసింది. ఇస్లామాబాద్‌లో జరిగిన శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో ఇరాన్‌ను మళ్లీ చర్చల వేదికకు తీసుకురావడానికి ఈ ఆర్థిక దిగ్బంధనాన్ని తమ ప్రధాన అస్త్రంగా అమెరికా ఉపయోగిస్తోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలతో ఏప్రిల్ 13న ఈ దిగ్బంధనం ప్రారంభమైంది. అప్పటి నుంచి చమురు లేదా ఇతర నిషేధిత వస్తువులను రవాణా చేస్తున్నాయనే అనుమానంతో 40కి పైగా నౌకలను దారి మళ్లించినట్లు పెంటగాన్ అధికారులు తెలిపారు. యాక్సియోస్ కథనం ప్రకారం ఈ ఆపరేషన్‌లో భాగంగా రెండు నౌకలను అమెరికా దళాలు స్వాధీనం చేసుకున్నాయి.

## ఈ నెల 4న తెలంగాణ కేబినెట్ భేటీ

మొదటిపేజీ తరువాయి – చర్చించనున్నట్లుగా తెలుస్తోంది. ఉద్యోగులు, పింఛనర్ల పెండింగ్ బిల్లులు 100 రోజుల్లో క్లియర్ చేయాలని భావిస్తున్న ప్రభుత్వం, అందుకు సంబంధించిన కార్యాచరణపై కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోనుంది. పెండింగ్ డీఏలు, ప్రభుత్వం నగదు రహిత చికిత్సలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, కొత్త ఆసరా ఫించన్లు, తెలంగాణ ఉద్యమకారుల కోసం కార్యక్రమాలు, ఇందిరమ్మ బీమా పథకం తదితర అంశాలపై కూడా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. ఇటీవల జరిగిన సమావేశంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు నామినేట్ పద్ధతిన పాలక వర్గాలను నియమించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గచ్చిబౌలి స్టేడియాన్ని పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అదే విధంగా ఉద్యోగులకు సంబంధించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ సహా పలు కీలక అంశాలపై ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

## మందుబాబులకు షాక్.. తెలంగాణలో భారీగా పెరగనున్న మద్యం ధరలు!



మొదటిపేజీ తరువాయి – ఇంధన ధరలు పెరగడం, ముడిసరుకుల రవాణా ఖర్చులు, బాటిళ్ల తయారీకి వినియోగించే గ్యాస్ ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రతిపాదనలను పక్కన పెట్టింది. అయితే, ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు కంపెనీల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ధరల పెంపునకు సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ధరల నిర్ధారణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఎక్సైజ్ శాఖ ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వచ్చే వారం తొలిసారి సమావేశమై, వివిధ బ్రాండ్ల ధరల పెంపుపై కంపెనీలు సమర్పించిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించనుంది. అయితే, ధరలను భారీగా పెంచితే సామాన్యుల నుంచి వ్యతిరేకత వస్తుందని, గ్రామాల్లో అక్రమ గుడుంబా తయారీ పెరిగే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. అందుకే, మధ్యేమార్గంగా ధరలను సవరించాలని యోచిస్తున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం.. సాధారణ బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై రూ.60, ప్రీమియం బ్రాండ్లపై రూ.100, ఖరీదైన బ్రాండ్లపై రూ.120 వరకు పెరిగే అవకాశం ఉంది. ఈ ధరల పెంపు ద్వారా ప్రభుత్వ ఖజానాకు నెలకు అదనంగా రూ.250 కోట్లు, ఏడాదికి సుమారు రూ.3,000 కోట్ల ఆదాయం సమకూరుతుందని ఎక్సైజ్ అధికారులు లెక్కలు వేస్తున్నారు. సాధారణంగా ప్రతి రెండేళ్లకోసారి ధరలను సవరించే ఆనవాయితీ ఉండగా.. 2023 మే నెలలో గత ప్రభుత్వం ధరలు పెంచింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు కంపెనీల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

## వాట్సాప్ వేదికగా వైద్య సేవలు

మొదటిపేజీ తరువాయి – ప్రజలకు, వైద్యులకు ఆరోగ్య సేవలను మరింత సులభతరం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. డిజిటల్ సేవల విస్తరణలో భాగంగా... ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సేవలను 'మనమిత్ర' వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తెచ్చింది. ఇకపై ప్రజలు మరియు వైద్యులు తమ మొబైల్ నుంచి 9552300009 వాట్సాప్ నంబర్‌కు "హాయ్" లేదా **Hi** అని మెసేజ్ పంపి.. తదనంతరం వచ్చే మెనూలో 'ఆరోగ్య శాఖ' ఆప్షన్‌ను ఎంచుకుని ఈ సేవలను సులభంగా పొందవచ్చు. ఈ సరికొత్త విధానం ద్వారా వైద్యులు తమ రిజిస్ట్రేషన్ వివరాలు, దరఖాస్తుల స్థితిగతులు, రాబోయే సీఎమ్ఈ కార్యక్రమాలు, క్రెడిట్ పాయింట్ల సమాచారాన్ని అరచేతిలోనే తెలుసుకోవచ్చు. అలాగే, సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని ఓపీ సేవలు, బ్లడ్ బ్యాంక్ లలో రక్త లభ్యతతో పాటు ఆసుపత్రులలో మందులు, శస్త్రచికిత్సకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉందో లేదో ఇట్టే ఆరా తీయవచ్చు. వైద్యులకు, రోగులకు ఒకే వేదికపై అత్యవసర సమాచారాన్ని అందిస్తూ, పౌరసేవలను మరింత చేరువ చేసే దిశగా ఏపీ ప్రభుత్వం వేసిన ఈ అడుగు పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## ప్రధాని మోదీపై షర్మిల ఫైర్




మొదటిపేజీ తరువాయి – వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచడంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్ర ప్రభుత్వం మరియు ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఓట్ల కోసం వేషాలు కట్టి, ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రజలపై 'బండ బాదుడు' మోపడం మోదీకి అలవాటుగా మారిందని ఆమె ఘాటుగా విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత కేంద్రం ఇచ్చిన అతిపెద్ద గిఫ్ట్ ఈ ధరల పెంపేనని షర్మిల ఎద్దేవా చేశారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ. 993, 5 కిలోల సిలిండర్‌పై రూ. 549 పెంచిన ఘనత మోదీకే దక్కుతుందని ఆమె అన్నారు. కేవలం ఆరు నెలల్లోనే రూ. 1,513 పెంచడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి అని, ఈ ఏడాదిలోనే ధర 80 శాతం పెరిగిందని ఆరోపించారు. ఈ అద్భుత ఘనకార్యానికి గుర్తుగా దేశంలోని మ్యూజియంలలో మోదీ పేరును సువర్ణాక్షరాలతో రాయించాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ ధరల పెంపు సామాన్యులకు వాతలు పెట్టడమేనని, బయట తినేవారిపై పెనుభారంగా మారుతుందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. టీ స్టాల్స్, చిన్న హోటళ్లు నడుపుకునే వ్యాపారుల జీవితాలను అగమ్యగోచరంగా మార్చారని, విద్యార్థులు, వలస కార్మికుల నడ్డి విరిచారని విమర్శించారు. చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు లాభాలు ఆర్జించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ధరలు పెరిగాయని ప్రజలపై భారం వేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. పెంచిన ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు షర్మిల స్పష్టం చేశారు.

## ఆంధ్రప్రదేశ్‌లో పుట్టపర్తి దశ మార్చనున్న డీఆర్‌డీవో



మొదటిపేజీ తరువాయి – కోసం మరో 400 ఎకరాలను కూడా అందుబాటులో ఉంచింది. నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేసి, 2029 నాటికి మొదటి నమూనాను సిద్ధం చేయాలని, 2035 నాటికి పూర్తిస్థాయిలో విమానాల ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఒక్క ప్రాజెక్టుతోనే కాకుండా శ్రీసత్యసాయి జిల్లా క్రమంగా ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా రూపాంతరం చెందుతోంది. ఇప్పటికే పాలసముద్రం వద్ద రూ.500 కోట్ల పెట్టుబడితో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) వెయ్యి ఎకరాల్లో డిఫెన్స్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తోంది. అలాగే మడకశిరలో కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ రూ.2,500 కోట్ల వ్యయంతో వెయ్యి ఎకరాల్లో డిఫెన్స్ ఎనర్జిటిక్స్ తయారీ కాంప్లెక్స్‌ను నిర్మించనుంది. ఇప్పుడు డీఆర్‌డీవో ప్రాజెక్టు కూడా తోడవడంతో జిల్లా పారిశ్రామిక స్వరూపం పూర్తిగా మారిపోనుంది. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి కేవలం 130 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉండటం పరిశ్రమల ఏర్పాటుకు కలిసివస్తోంది. బెంగళూరు చుట్టుపక్కల రక్షణ రంగ విస్తరణకు అవకాశాలు తగ్గడంతో కంపెనీలన్నీ శ్రీసత్యసాయి జిల్లా వైపు చూస్తున్నాయి. జిల్లాలోని పుట్టపర్తిలో విమానాశ్రయం అందుబాటులో ఉండటం కూడా ఈ ప్రాజెక్టులకు అదనపు బలంగా మారింది. ఈ పరిణామాలతో రానున్న రోజుల్లో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఈ ప్రాంతానికి రావడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇజ్రాయెల్ గూఢచారులని ఇద్దరిని ఉరితీసిన ఇరాన్



మొదటిపేజీ తరువాయి – ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్ కోసం పనిచేశారన్న ఆరోపణలతో ఇరాన్ శనివారం ఇద్దరు వ్యక్తులను ఉరితీసింది. యాకూబ్ కరీంపూర్, నాసర్ బెకర్జాదే అనే ఈ ఇద్దరికీ సుప్రీం కోర్టు మరణశిక్షను ఖరారు చేయడంతో, న్యాయ ప్రక్రియల అనంతరం శిక్షను అమలు చేసినట్టు ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన మిజాన్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్‌తో 40 రోజుల పాటు జరిగిన యుద్ధ సమయంలో కరీంపూర్ మొసాద్‌కు చురుకుగా సహకరించినట్టు అధికారులు తెలిపారు. దేశానికి సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని టెలిగ్రామ్ ద్వారా ఒక మొసాద్ అధికారికి చేరవేసినట్లు పేర్కొన్నారు. సైనిక స్థావరాల వద్ద పేలుళ్లు జరపడం, వాటిని చిత్రీకరించడం, భద్రతా సంస్థలను తప్పుదోవ పట్టించడం వంటి పనులకు గాను ఇతను డబ్బులు స్వీకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరో దోషి అయిన బెకర్జాదే, ఇరాన్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు, ఉన్నతాధికారులు, మత పెద్దలకు సంబంధించిన సమాచారం, ఫోటోలు, వీడియోలను వాట్సాప్, ఈమెయిల్ ద్వారా మొసాద్‌కు అందించినట్లు అధికారులు తెలిపారు. దీనికి ప్రతిఫలంగా ఇతను కూడా డబ్బులు తీసుకున్నట్లు నిర్ధారించారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు ప్రారంభించగా, ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. కాగా, కాంగ్రెస్ అనుమతి లేకుండా ప్రారంభించిన సైనిక చర్యకు 60 రోజుల గడువు ముగియడంతో ఇరాన్‌తో యుద్ధం ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన రోజే ఈ ఉరిశిక్షలు అమలు కావడం గమనార్హం.

## కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదు



మొదటిపేజీ తరువాయి – కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలు, అవినీతి, కుంభకోణాలను చూసి ప్రజలు మరో ఇరవై ఏళ్లు ఆ పార్టీకి ఓటు వేయరని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల అవినీతి బాగా పెరిగిపోయిందని అన్నారు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిందని, ఇప్పుడు చేతులెత్తేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలు చూసిన ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. నిన్న మోదీ ప్రభుత్వం వాణిజ్య సిలిండర్‌పై సుమారు రూ.993 పెంచిందని, ప్రజా వ్యతిరేక విధానాలకు ఇదే నిదర్శనమని అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఎక్కడికక్కడ నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

## గ్యాస్ దొంగలను పట్టించిన తండ్రీకొడుకులకు సీపీ సజ్జనార్ సత్కారం

**సిలిండర్ల నుంచి గ్యాస్ చోరీ చేస్తున్న వారిని పట్టించిన తండ్రీకొడుకులు**

**ప్రశంసాపత్రంతో పాటు నగదు పురస్కారం అందజేత**

**అక్రమాలపై ప్రతిపౌరుడు ఇలాగే చైతన్యంతో స్పందించాలన్న సజ్జనార్**



కస్టమర్లకు న్యాయంగా చేరాల్సిన గ్యాస్ సిలిండర్ల నుంచి గ్యాస్ చోరీ చేస్తున్న దొంగలను పట్టించిన తండ్రీకొడుకులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అభినందించారు. ధైర్యంగా గ్యాస్ మాఫియా గుట్టురట్టు చేయడాన్ని కొనియాడుతూ, శనివారం బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందజేసి, పౌర చైతన్యానికి మారుపేరుగా నిలిచారని ప్రశంసించారు. సమాజంలో జరుగుతున్న అక్రమాలపై ప్రతి పౌరుడు ఇలాగే చైతన్యంతో స్పందించినప్పుడే నేరరహిత సమాజం నిర్మించగలమని ఆయన పేర్కొన్నారు. చుడీబజార్‌కు చెందిన వ్యాపారి అశోక్ తివారీ గత నెల 21న గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేశారు. డెలివరీ సమయంలో బరువు తక్కువగా ఉండటాన్ని ఆయన కుమారుడు 16 ఏళ్ల నమాన్ తివారి గమనించారు. గత డెలివరీ సమయంలోనూ ఇలాగే సిలిండర్ రెండు కిలోలు తక్కువగా ఉందని తన తండ్రి దృష్టికి తీసుకెళ్లారు. నిబంధనల ప్రకారం 30.4 కిలోలు ఉండాల్సిన సిలిండర్, కేవలం 28 కిలోల బరువు మాత్రమే ఉండటం గుర్తించారు. గత కొంతకాలంగా గ్యాస్ త్వరగా అయిపోతుండటంతో అనుమానం వచ్చి బరువు తనిఖీ చేయగా, సుమారు రెండు కిలోల గ్యాస్ తక్కువగా ఉన్నట్లు తేలింది. తనకు గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేసే సిద్ధార్థ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీ ప్రతినిధులను ప్రశ్నించగా వారు దురుసుగా సమాధానం ఇచ్చినట్లు ఆరోపించారు. ఆ తర్వాత తండ్రీకొడుకులు గ్యాస్ తక్కువ రావడం గురించి ఆరా తీశారు. సదరు ఏజెన్సీ ఉద్యోగులు గ్యాస్ సిలిండర్లను జుమేరాత్ బజార్‌లోని ఒక ఇంట్లో అక్రమంగా చిన్న సిలిండర్లలోకి, వాణిజ్య అవసరాల కోసం రీఫిల్లింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. బహిరంగ ప్రదేశాల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారంటూ గోషామహల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేవలం గ్యాస్ తక్కువగా ఇవ్వడమే కాకుండా, జనసమ్మర్ద ప్రాంతంలో అత్యంత ప్రమాదకర రీతిలో రీఫిల్లింగ్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సిద్దార్థ ఎంటర్ ప్రైజెస్ ఏజెన్సీతో పాటు ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి సాయి కుమార్, వినీత్ కుమార్, పూస గణేశ్, ప్రవీణ్ కుమార్, అమిత్ కుమార్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు కమర్షియల్, ఏడు డొమెస్టిక్, 12 చిన్న సిలిండర్లతో పాటు రీఫిల్లింగ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పౌర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి, గ్యాస్ ఏజెన్సీల అక్రమదందాను వెలుగులోకి తెచ్చిన తండ్రీకొడుకులను సీపీ వీసీ సజ్జనర్ ప్రశంసించారు. "యూనిఫామ్ లేని పోలీసులా వ్యవహరించి, వ్యవస్థలోని అక్రమాలను ధైర్యంగా ప్రశ్నించిన వీరు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయులు. అక్రమార్కులు సామాన్యుల కష్టార్జితాన్ని దోచుకోవడమే కాకుండా, రీఫిల్లింగ్ పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుంటే చూస్తూ ఊరుకోకూడదని నిరూపించారు. ప్రతి పౌరుడు ఇంతే చైతన్యంతో స్పందిస్తే నేరస్తులు సమాజంలో తలదాచుకోలేరు. ఇలాంటి బాధ్యతాయుతమైన వ్యక్తులకు పోలీసు శాఖ ఎప్పుడూ వెన్నుదన్నుగా ఉంటుంది" అని ఆయన అన్నారు. వినియోగదారులు కూడా తమకు అందే వస్తువుల నాణ్యత, పరిమాణంపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. అక్రమ గ్యాస్ ఫిల్లింగ్ కు పాల్పడేవారిపై హైదరాబాద్ సిటీ పోలీస్ కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎక్కడైనా మోసం జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 గానీ, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## పెద్దపల్లి తండ్రి-కొడుకుల ఘన విజయం - మౌంట్ కోసియాస్కో అధిరోహణ

**ఆస్ట్రేలియాలో అత్యున్నత శిఖరాన్ని అధిరోహించిన 15 ఏళ్ల బాలుడు**

**"YES FOR LIFE – SAY NO TO DRUGS" సందేశంతో శిఖరాన్ని చేరిన తండ్రి-కొడుకులు**


**ఎల్బ్రస్ తర్వాత కోసియాస్కో -- మరో ఘనత సాధించిన మహిపాల్ రెడ్డి కుటుంబం**

**అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న పెద్దపల్లి జిల్లా కి చెందిన తండ్రి కొడుకులు**





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 02(వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లా సెంటినరీ కాలనీకి చెందిన తండ్రి-కొడుకులు లెంకల మహిపాల్ రెడ్డి మరియు ఆయన కుమారుడు లెంకల వివేకానంద రెడ్డి (15 సంవత్సరాలు) ఆస్ట్రేలియా ఖండంలోనే అత్యంత ఎత్తైన శిఖరం అయిన మౌంట్ కోసియాస్కో (2,228 మీటర్లు / 7,310 అడుగులు)ను విజయవంతంగా అధిరోహించి ఘన విజయం సాధించారు. ఈ అధిరోహణ కోసం వారు ఏప్రిల్ 30న ప్రయాణం ప్రారంభించి, మే 2 సాయంత్రం 6:30 గంటలకు (ఆస్ట్రేలియా స్థానిక కాలమానం ప్రకారం) శిఖరాన్ని చేరుకున్నారు. ఇదివరకు కూడా ఈ తండ్రి-కొడుకులు యూరప్ ఖండంలోనే అత్యంత ఎత్తైన శిఖరం అయిన రష్యాలోని మౌంట్ ఎల్బ్రస్‌ను విజయవంతంగా అధిరోహించి తమ ప్రతిభను నిరూపించారు. ఈ సందర్భంగా వారు "YES FOR LIFE – SAY NO TO DRUGS" అనే సందేశంతో బ్యానర్‌ను ప్రదర్శిస్తూ, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, క్రీడలు మరియు మౌంటనీరింగ్ వంటి సానుకూల రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ ఘన విజయాన్ని సాధించిన లెంకల మహిపాల్ రెడ్డి మరియు లెంకల వివేకానంద రెడ్డిని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష , జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి ,డీవైఎస్‌వో సురేష్ అభినందించారు.



## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక : కూకట్‌పల్లిలో ఘనంగా నియోజకవర్గ స్థాయి సమావేశం





**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం కూకట్‌పల్లిలోని ఎన్.కె.ఎన్.ఆర్ గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. వివిధ శాఖల ఉన్నతాధికారులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, స్థానిక సమస్యలను గుర్తించి అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం ఈ సమావేశం యొక్క ప్రధాన ఉద్దేశమని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం అమలవుతున్న మరియు భవిష్యత్తులో చేపట్టబోయే పలు పథకాలపై చర్చించారు రైతు భరోసా సన్నరకం వరి బోనస్ మహాలక్ష్మి

**గృహజ్యోతి పథకాలు ఇందిరమ్మ ఇళ్లు చేయూత పెన్షన్లు**

కల్యాణలక్ష్మి పథకం ఈ కార్యక్రమానికి హాజరైన టిపిసిసి ఉపాధ్యక్షులు మరియు కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ.. "ప్రజలే కేంద్రంగా, పారదర్శకతే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించింది. స్థానిక అభివృద్ధి అవసరాలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసేందుకు ఇది ఒక వేదిక. అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రజల మధ్య నేరుగా సంబంధాలు పెంపొందించడానికి ఈ ప్రజాపాలన తోడ్పడుతుంది" అని పేర్కొన్నారు.ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి వినోద్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, డిప్యూటీ కమిషనర్ హనుమంత్, కూకట్‌పల్లి ఎంఆర్ఓ స్వామి, బాల?నగర్ ఎంఆర్ఓ శ్రీనివాస్, రవీంద్ర మండల్ ఎగ్జిక్యూటివ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బ్లాక్ మరియు డివిజన్ అధ్యక్షులు, మహిళా విభాగం, యూత్ కాంగ్రెస్, మైనారిటీ, ఎస్ సి బిసి సెల్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## కుకట్‌పల్లిలో నవ దంపతుల ఆత్మహత్య



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కుకట్‌పల్లిలోని కుమ్మరిబస్తీలో విషాదం చోటుచేసుకుంది. యెంజల కార్తీక్ (28), ఆయన భార్య యెర్రమల్ల మంజుల అలియాస్ జ్ఞాన్సిక (27) తమ నివాసంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. కార్తీక్ ఐటీసీ కంపెనీలో మార్కెటింగ్ విభాగంలో పనిచేస్తుండగా, మంజుల గృహిణి. అనన్య హాస్పిటల్ నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, మరణానికి గల కారణాలను విశ్లేషించేందుకు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. వీరి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## సమావేశ కార్యక్రమంలో పాల్గొన్న బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 02:** ఈ నెల 10వ తేదీన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ కు విచ్చేస్తున్న సందర్భంగా పరేడ్ గ్రౌండ్, సికింద్రాబాద్ లో నిర్వహించే భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలని ఉమ్మడి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని భారతీయ జనతా పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమీక్ష సమావేశ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ప్రభరి, ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి మరియు బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి , జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి , డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు , జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీధర్ రావు, మాజీ కౌన్సిలర్ అంజన్ కుమార్ గౌడ్ మరియు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు తదితరులు హాజరు కావడం జరిగింది.

# ఆహారం వృధా ... ఆకలి వ్యథ...!



**ఒక్క ప్లేట్ భోజనం ఒక్క ప్రాణానికి ఆశ**

**మానవత్వం ఎక్కడ ..... ?**

**ఆకలితో ఉన్నవారికి అందించండి**

**భద్రాద్రి జిల్లా బ్యూరో జడల నాగప్రసాద్, మే 02 (వార్త సంధ్య) :** ప్రస్తుత కాలంలో ఆహారపు వినియోగం విషయంలో సమాజంలో తీవ్ర అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకవైపు ఇళ్లలో, ఫంక్షన్ హాళ్లలో, హోటళ్లలో పెద్ద మొత్తంలో ఆహారం వృధా అవుతుండగా, మరోవైపు అదే సమాజంలో ఎన్నో కుటుంబాలు రోజుకు ఒకపూట భోజనం కోసం కూడా ఇబ్బందులు పడుతున్నాయి. ఈ విరుద్ధ పరిస్థితి మనలో ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేయాల్సిన అవసరం ఉంది. పెళ్లిళ్లు, వేడుకలు, సమావేశాలు వంటి కార్యక్రమాల్లో అవసరానికి మించి ఆహారం తయారు చేయడం సాధారణంగా మారిపోయింది. అయితే ఆ మిగిలిన ఆహారం ఎక్కువగా చెత్తబుట్టల్లో పడుతుండటం బాధాకరం. ఆహారం వృధా కావడం అంటే కేవలం పదార్థం నష్టమే కాదు, దానికోసం వినియోగించిన నీరు, శ్రమ, ధనం అన్నీ వృధా కావడమే.

ఇదే సమయంలో పట్టణాల్లో, గ్రామాల్లో ఎన్నో నిరుపేద కుటుంబాలు, నిరాశ్రయులు, వృద్ధులు, అనాథలు ఆకలితో బాధపడుతున్నారు. వారికి ఒకపూట భోజనం అందితే అది వారి కోసం గొప్ప ఉపశమనం అవుతుంది. ఈ నేపథ్యంలో మిగిలిన ఆహారాన్ని సేకరించి అవసరమైన వారికి అందించే సేవా సంస్థలు కూడా పనిచేస్తున్నాయి. అయితే సమాజం మొత్తం ఈ దిశగా ముందుకు వస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. ప్రతి ఇంట్లోనూ "అవసరమైనంత మాత్రమే వండాలి" అనే అవగాహన పెరగాలి.



మిగిలిన ఆహారాన్ని సమీపంలోని ఆశ్రమాలు, అనాథశ్రమాలు, పేదవారికి అందించే ప్రయత్నం చేయాలి. అలాగే యువత, స్వచ్ఛంద సంస్థలు ఈ విషయంలో చైతన్యం కల్పిస్తూ ముందుండాలి. చిన్నచిన్న మార్పులు పెద్ద ఫలితాలను ఇస్తాయి. మనం వృథా చేయబోయే ఒక భోజనం, ఎవరికో ఒకరి ఆకలి తీర్చగలదు. "అన్నదానం మహాదానం" అనే భావనను మన సంస్కృతి ఎప్పుడో నేర్పింది. ఇప్పుడు దాన్ని మన దైనందిన జీవితంలో అమలు చేసే సమయం వచ్చింది. ఆహారాన్ని గౌరవించడం, వృథా చేయకుండా అవసరమైన వారికి పంచడం ద్వారా మనం సమాజానికి ఒక మంచి సందేశం ఇవ్వగలం. ఇదే నిజమైన మానవత్వం.

## ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన గుంటకు శాశ్వత పరిష్కారం

**- సేవా స్ఫూర్తి చాటుకున్న రాజీవ్ యూత్ అసోసియేషన్**

**మునుగోడు :మే- 02(వార్త సంధ్య):** మునుగోడు మండలంలోని గూడపూర్ గ్రామ బస్టాండ్ చౌరస్తా వద్ద గత కొన్ని రోజులుగా ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తూ, వాహనదారుల ప్రాణాలకు ముప్పుగా మారిన ప్రమాదకరమైన గుంటను రాజీవ్ యూత్ అసోసియేషన్ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి కాంక్రీటుతో పూడ్చివేసి తమ సేవా తత్వాన్ని చాటుకున్నారు. గ్రామ ప్రజల భద్రత, సౌకర్యం కోసం యువత ఏకమై చేసిన ఈ కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది.గ్రామంలోని ప్రధాన రహదారిపై ఉన్న బస్టాండ్ చౌరస్తా ప్రాంతంలో వాటర్ పైప్‌లైన్ మరమ్మత్తుల నిమిత్తం అధికారులు తవ్విన గుంట పనులు పూర్తయిన అనంతరం అలాగే వదిలేయడంతో, రోజూ ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో గుంట స్పష్టంగా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఇప్పటికే అక్కడ కొన్ని చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకోవడం, పలువురు గాయపడటం వంటి సంఘటనలు గ్రామ ప్రజలను ఆందోళనకు గురిచేశాయి.ఈ సమస్యను గుర్తించిన రాజీవ్ యూత్ అసోసియేషన్ సభ్యులు స్పందించి, అధికారుల





స్పందన కోసం ఎదురుచూడకుండా తామే ముందడుగు వేశారు. ప్రజల ప్రాణ రక్షణే ప్రధాన లక్ష్యంగా భావించి, స్వచ్ఛందంగా శ్రమదానం నిర్వహించి, సొంత ఖర్చులతో కాంక్రీట్, ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రిని సమకూర్చి గుంటను శాశ్వతంగా పూడ్చివేశారు. గంటల తరబడి శ్రమించి రహదారిని తిరిగి ప్రయాణానికి అనువుగా మార్చారు.ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ...

"గ్రామంలో ప్రజలకు ఇబ్బంది కలిగించే ఏ సమస్య వచ్చినా దాని పరిష్కారానికి యువత ముందుండాలి. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం ద్వారానే మన బాధ్యతను నెరవేర్చిన వారమవుతాం. భవిష్యత్తులో కూడా గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం రాజీవ్ యూత్ అసోసియేషన్ నిరంతరం సేవలందిస్తుంది" అని పేర్కొన్నారు.

రాజీవ్ యూత్ అసోసియేషన్ సభ్యులు చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామ యువతలో సేవా భావాన్ని పెంపొందించడమే కాకుండా, సామాజిక బాధ్యత పట్ల చైతన్యం కలిగించేలా నిలిచింది. గ్రామ ప్రజలు, పెద్దలు అసోసియేషన్ సభ్యుల సేవా దృక్పథాన్ని అభినందిస్తూ, యువత ఇలాగే సమాజ సమస్యల పరిష్కారంలో ముందుండాలని ఆకాంక్షించారు."సేవే లక్ష్యం... సమాజమే గమ్యం" అనే నినాదానికి నిదర్శనంగా రాజీవ్ యూత్ అసోసియేషన్ నిలిచిందని పలువురు కొనియాడారు.

## సెన్సస్ 2027 విజయవంతానికి సమన్వయంతో ముందుకు సాగాలి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**స్వీయ గణనపై స్పందన తక్కువ**

**--4 రోజుల్లో 50 వేల నమోదు లక్ష్యం**

**ప్రతి గ్రామం,వార్డులో కనీసం 100 కుటుంబాలు స్వీయ గణన చేయాలి**

**ప్రభుత్వ సిబ్బంది,సంస్థల ఉద్యోగులు 100% స్వీయ గణన పూర్తి చేయాలి**

**స్వీయ గణన 2027 పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్ట**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 02(వార్త సంధ్య) :** జిల్లాలో సెన్సస్ 2027 ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) జె. అరుణ శ్రీ, డీసీపీ రామ్ రెడ్డి తో కలిసి సెన్సస్ 2027 పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 1881 సంవత్సరం నుండి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జనగణన నిర్వహిస్తున్నామని, కోవిడ్ కారణంగా ఆలస్యమైనప్పటికీ ఇప్పుడు16వ జనగణన చేపడుతున్నామని తెలిపారు.

సర్వేలకు భిన్నంగా సెన్సస్ చట్టబద్ధ ప్రక్రియ అని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలు ఇవ్వాలని, ఎవరూ సమాచారం దాచకూడదని స్పష్టం చేశారు. జనగణనను రెండు దశల్లో నిర్వహిస్తామని తెలిపారు. మే 11 నుండి జూన్ 9 వరకు మొదటి దశగా హౌస్ లిస్టింగ్ చేపట్టి ఇళ్లకు సంబంధించిన 33 ప్రశ్నలపై వివరాలు సేకరిస్తామని చెప్పారు. నీటి కనెక్షన్, మరుగుదొడ్డి, గ్యాస్ కనెక్షన్, ఫోన్, ఇంటర్నెట్, ఆహార ధాన్యాల వినియోగం వంటి అంశాలను నమోదు చేస్తారని తెలిపారు. జిల్లాలో మొత్తం 1548 హౌస్ లిస్టింగ్ బ్లాకులు గుర్తించగా,ప్రతి బ్లాక్‌లో సుమారు 300 ఇళ్లు ,, 800 మంది జనాభా ఉంటుందని పేర్కొన్నారు. రెండో దశగా 2027 ఫిబ్రవరి-మార్చి నెలల్లో జనాభా గణన నిర్వహిస్తామని తెలిపారు. మొత్తం ప్రక్రియ డిజిటల్ విధానంలో జరుగుతుందని, డేటా గోప్యతకు పూర్తి భద్రత ఉంటుందని స్పష్టం చేశారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించామని, ౦వ.ఏవఅంబం.స్త్రశీఱ.ఱఅ వెబ్‌సైట్‌లో కుటుంబంలోని ఒక సభ్యుడు లాగిన్ అయి వివరాలు నమోదు చేయవచ్చని తెలిపారు. నమోదు అనంతరం 11 అంకెల ప్రత్యేక నంబర్ వస్తుందని, ఆ నంబర్‌ను ఎన్యుమరేటర్‌కు ఇవ్వాలని సూచించారు. తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు స్వీయ గణనపై స్పందన చాలా తక్కువగా ఉందని, సుమారు 10 వేల మంది ఉద్యోగులు ఉన్నప్పటికీ కేవలం 1500 నమోదులు మాత్రమే జరిగాయని తెలిపారు. ఇది ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ఉద్యోగులు తక్షణమే స్వీయ గణన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్టీపీసీ, కేశోరం, ఆర్ఎఫ్ సీఎల్, సింగరేణి సంస్థలలో 100 శాతం స్వీయ గణన పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రామ స్థాయిలో ఎంపీడీవోలు అవ గాహన కార్యక్రమాలు నిర్వహించి, పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ సిబ్బంది స్వీయ గణన చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ప్రతి గ్రామంలో కనీసం 100 కుటుంబాలు, మున్సి పాలిటీల్లో ప్రతి వార్డులో కనీసం 100 కుటుంబాలు స్వీయ గణన చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సివిల్ సప్లైస్ అధికారులు రేషన్ డీలర్ల ద్వారా,డీఆర్‌డీఓ అధికారులు స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రతి సంఘంలో కనీసం 3 మంది నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ శాఖ ఫీల్డ్ సిబ్బంది, వ్యవసాయ శాఖ ఏఈఓలు రైతు వేదికల ద్వారా అవ గాహన కల్పించి కనీసం 15 మంది నమోదు చేయించాలని సూచించారు. కాలేజీ విద్యార్థులు కూడా స్వీయ గణనలో పాల్గొనేలా చైతన్యం కల్పించాలని కోరారు. వచ్చే 4 పని దినాల్లో 50 వేల స్వీయ గణన నమోదు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు సురేష్, బి. గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ప్రధాని మోడీ పర్యటన పక్కా పొలిటికల్

**అని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు.**

**శనివారం కామారెడ్డి బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం మొట్టమొదటి సారిగా తెలంగాణాలో ప్రధాని మోడీ పర్యటించడం ప్రతిపక్ష పార్టీలలో హాట్ చర్చకు దారి తీసిందన్నారు.**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 2 ( వార్తా సంధ్య ) :** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో బీజేపీ గెలవబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎప్పుడో మర్చిపోయారని, ఇక రీజనల్ పార్టీలలో అందరికి అభద్రతభావం, వణుకు మొదలైందన్నారు. వెస్ట్ బెంగాల్ లో రీజనల్ పార్టీగా ఎదిగిన ప్రాంతంలో మమతా బెనర్జీని ఓడించడం డిఫరెంట్ లెవల్ అని పేర్కొన్నారు. అక్కడ గెలిచిన పార్టీ ఎక్కడైనా గెలుస్తుందని చెప్పారు. తెలంగాణలో రూ.7823 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు ప్రధాని మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు తెలిపారు. ౦

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో రూ.2360 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ పనులకు శంకుస్థాపన, ఇతర రాష్ట్రాల నుంచి మహబూబ్ నగర్ 161 నేషనల్ హైవేపై 4 లైన్ల రహదారి పనులకు రూ.3175 కోట్లు, అమృత్ భారత్ పథకం కింద రూ.40 కోట్లతో ఆధునికరించిన రెండు రైల్వే స్టేషన్లు, రూ.200 కోట్లతో వరంగల్ లో నిర్మించిన పిఎం మిత్ర టెక్స్ టైల్ పార్కు, రూ.611 కోట్లతో నిర్మించిన రైల్వే టెర్మినల్స్, రూ.1243 కోట్లతో కాజీపేట-విజయవాడ వరకు 3 లైన్ల రైల్వే పనులకు ప్రధాని మోడీ శంకుస్థాపనలు,




ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు ఎంపీ వివరించారు. అనంతరం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో సుమారు 3 లక్షల మందితో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. తెలంగాణలో మోడీ పర్యటనతో కేసీఆర్, రేవంత్ రెడ్డిలతో పాటు ప్రాంతీయ పార్టీల వెన్నులో వణుకు మొదలవుతుందన్నారు.

ఈ పార్టీలన్నీ పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేసి భవిష్యత్తులో వారి సమాధిని వారే తవ్వుకున్నారన్నారు. వచ్చే 17 వ లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేయిస్తామని, ఎవరు వ్యతిరేక ఓటు వేసిన ఆగదన్నారు. అయితే మెజారిటీ 543 ఉంటుందా.. 800 ఉంటుందా.. 700 ఉంటుందా అనేది చెప్పలేమన్నారు. గడిచిన పార్లమెంట్ సమావేశాల్లో ఎవరు ఏమిటో, ఏ పార్టీ వ్యతిరేకమో బట్టబయలైందన్నారు. తెలంగాణలో పురుడు పోసుకున్న టిఆర్ఎస్ పార్టీ ఎవరిపై ప్రభావం చూపదన్నారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆమె తండ్రి, అన్న చేసినవన్నీ బయటపెడుతుందన్నారు. లిక్కర్ స్కాములో ఎవిడెన్స్ లేవని మాత్రమే కోర్టు చెప్పిందన్నారు.

ఆ కేసులో సిబిఐ ఎంటరైందని పేర్కొన్నారు. ఎవిడెన్స్ లేవని చెప్పినంత మాత్రాన స్కామ్ జరగలేదని కాదన్నారు. కల్వకుంట్ల కుటుంబంలో ఎవరు సుద్దపూసలు

లేరని ఎద్దేవా చేశారు. కవిత టిఆర్ఎస్ పార్టీకి సీఎం రేవంత్ సపోర్టు ఉందని తెలిపారు. అంతిమంగా అది బీజేపీకి ప్లస్ అవుతుందన్నారు.

# తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు శుభవార్త

**ఆర్టీసీ కార్మికుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం**

**మూడు రోజుల సమ్మె కాలాన్ని రెగ్యులర్ డ్యూటీగా పరిగణిస్తామని వెల్లడి**

**కార్మికులపై పెట్టిన పోలీసు కేసులను కూడా ఎత్తివేయాలని ఆదేశం**

**వెంటనే చర్యలు తీసుకోవాలని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సీఎం సూచన**

**వెయ్యి కొత్త ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయనున్నట్లు ప్రకటన**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. ఇటీవల కార్మికులు చేపట్టిన మూడు రోజుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ కాలాన్ని రెగ్యులర్ డ్యూటీగా పరిగణించనున్నట్లు సీఎం స్పష్టం చేశారు. అదేవిధంగా, సమ్మె సమయంలో కార్మికులపై నమోదు చేసిన పోలీసు కేసులను కూడా ఉపసంహరించుకోవాలని ఆయన ఆదేశించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో నిన్న టీజీఎస్ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారు. సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని, కేసులు ఎత్తివేయాలని కార్మిక సంఘాల నేతలు చేసిన విజ్ఞప్తికి సీఎం సానుకూలంగా స్పందించారు. ఈ హామీల అమలుకు తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలను 100 శాతం పరిష్కరించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. సంస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా రూ.8,000 కోట్లు అందించిందని, ఉద్యోగుల బకాయిల కోసం రూ.1,000 కోట్లు విడుదల చేసిందని గుర్తుచేశారు. అలాగే, మెట్రో రైల్ నెట్‌వర్క్‌కు అనుసంధానంగా 1,000 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. శంషాబాద్ సమీపంలోని బహదూర్‌గూడలో 150 ఎకరాల్లో, గజులరామారంలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ సంఘాల నేతలు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పూడి శ్రీహరి కేసు.. నల్లపాడు పోలీసులకు హైకోర్టు సూచనలు

**శ్రీహరి విషయంలో చట్టప్రకారం నడుచుకోవాలన్న హైకోర్టు**

**సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని సూచన**

**తదుపరి చర్యలన్నీ చట్టబద్ధంగా ఉండాలని ఆదేశం**



ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత పోస్టు పెట్టిన కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ నేత, ఆ పార్టీ మీడియా కోఆర్డినేటర్ పూడి శ్రీహరి విషయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టుల నేపథ్యంలో నమోదైన కేసులపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు, పోలీసులకు కీలక ఆదేశాలిచ్చారు. శ్రీహరి విషయంలో చట్టప్రకారం నడుచుకోవాలని గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులకు స్పష్టం చేస్తూ, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఆయనను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచిన నేపథ్యంలో, తదుపరి చర్యలన్నీ చట్టబద్ధంగా ఉండాలని కోర్టు ఆదేశించింది. తనపై నల్లపాడు, కొత్తపేట పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను కొట్టివేయాలని కోరుతూ శ్రీహరి దాఖలు చేసిన పిటిషన్లపై సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. ఏడు ఏళ్ల లోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినప్పటికీ, కుప్పం కేసులో విడుదలైన వెంటనే పోలీసులు మళ్లీ అరెస్ట్ చేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. మరోవైపు, పిటిషనర్ దర్యాప్తుకు సహకరించడం లేదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు, చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది.

# చెరువుల పునరుద్ధరణ బాధితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు

**హైడ్రా కమిషనర్ హామీ**

**సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ హామీ**

**గూగుల్ మ్యాప్స్ ఆధారంగా 2024 జులై 19కి ముందున్న వారి గుర్తింపు**

**బడా కబ్జాదారులపై కఠినంగా, నిరుపేదలకు అండగా ఉంటామన్న ప్రభుత్వం**

**సున్నం, రామంతాపూర్ చెరువుల బాధితులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం**



గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చెరువులను పునరుద్ధరించి, కబ్జాల నుంచి విముక్తి చేసే బృహత్తర కార్యక్రమంలో భాగంగా నివాసాలు కోల్పోతున్న నిరుపేదల పట్ల తెలంగాణ ప్రభుత్వం మానవతా దృక్పథంతో కీలక నిర్ణయం తీసుకుంది. చెరువులను ఆక్రమించిన బడా కబ్జాదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూనే, జీవనోపాధి కోసం వచ్చి గుడిసెలు వేసుకున్న పేదలకు అన్యాయం జరగకూడదన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వారికి అండగా నిలవనుంది. చెరువుల పునరుద్ధరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన అర్హులైన ప్రతి పేద కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించనున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. శుక్రవారం మాదాపూర్‌లోని సున్నం చెరువు, రామంతాపూర్ చెరువు ప్రాంతాల బాధితులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై ఈ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో బాధితుల గుర్తింపు ప్రక్రియను హైడ్రా వేగవంతం చేసింది. ఈ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా కేవలం అర్హులైన వారికే ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం సాంకేతికతను వినియోగిస్తోంది. 2024 జులై 19వ తేదీని కటాఫ్‌గా నిర్ణయించి, ఆ తేదీకి ముందు నుంచే అక్కడ నివాసం ఉంటున్న వారిని గూగుల్ మ్యాప్స్, శాటిలైట్ చిత్రాల ఆధారంగా గుర్తించి జాబితాలు సిద్ధం చేస్తున్నారు. ఈ విధానం వల్ల పేదల ముసుగులో లబ్ధి పొందాలనుకునే కబ్జాదారుల ప్రయత్నాలకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు భావిస్తున్నారు. నగరవ్యాప్తంగా చెరువుల వద్ద ఇళ్లు కోల్పోయిన వారందరికీ ఇదే నిబంధన వర్తిస్తుందని కమిషనర్ రంగనాథ్ తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో కమిషనర్ బాధితుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కోసం నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు పొరుగున ఉన్న ఏపీ నుంచి వలస వచ్చి, చెత్త ఏరుకుంటూ జీవిస్తున్న వారే అధికంగా ఉన్నట్లు గుర్తించారు. బయట అద్దె ఇళ్లు దొరకని పరిస్థితుల్లోనే చెరువుల దగ్గర తలదాచుకోవాల్సి వచ్చిందని బాధితులు తమ ఆవేదనను వెళ్లగక్కారు. దీనిపై స్పందించిన రంగనాథ్, ప్రభుత్వం వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు శాశ్వత గృహవసతి కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పక్కా ఆధారాలతో నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, హైడ్రా ఇప్పటికే నగరంలో అనేక చెరువులను పునరుద్ధరించి, వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఇటీవల చెన్నై నుంచి వచ్చిన ఓ బృందం హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించడం గమనార్హం.

# సహజీవనం చేస్తున్న జంటలో రీచార్జ్ చిచ్చు

**ఉరేసుకున్న ప్రియురాలు**

**హైదరాబాద్‌లోని జీడిమెట్ల పరిధిలో ఘటన**

**సహజీవనం చేస్తున్న జంట మధ్య రీచార్జ్ విషయంలో వాగ్వాదం**

**ప్రియుడు ఫోన్ రీచార్జ్ చేయించలేదని యువతి ఆత్మహత్య**



ప్రియుడు మొబైల్ ఫోన్‌కు రీచార్జ్ చేయించలేదన్న మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హైదరాబాద్ నగరంలోని జీడిమెట్లలో చోటుచేసుకుంది. కుత్బుల్లాపూర్ ప్రశాంత్ నగర్‌లో కిరణ్మయి అనే యువతి నివాసం ఉంటోంది. గతంలో ఆమెకు వివాహమై విడాకులు తీసుకుంది. వీరికి ఒక కుమారుడు ఉండగా, అతను కిరణ్మయి తల్లి వద్ద పెరుగుతున్నాడు. ఈ క్రమంలో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న ఆమెకు వెంకటేశ్ అలియాస్ చందూ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఏడాది కాలంగా వీరిద్దరూ సహజీవనం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం కిరణ్మయి ఫోన్ రీచార్జ్ గడువు ముగిసింది. జీతం ఇంకా రాకపోవడంతో తన ప్రియుడు వెంకటేశ్‌ను రీచార్జ్ చేయించమని కోరింది. అందుకు అతను నిరాకరించడంతో శుక్రవారం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన కిరణ్మయి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. చిన్న గొడవకే యువతి ప్రాణాలు తీసుకోవడంపై పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు.

# అమరావతి ఖర్చుపై వైకాపా దుష్ప్రచారం

**రుషికొండ లెక్కలు గుర్తుచేసిన షరీఫ్**

**అమరావతి నిర్మాణ వ్యయంపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందన్న ఎంఏ షరీఫ్**

**చదరపు అడుగుకు రూ.6,980 ఖర్చవుతుంటే, జగన్ రెట్టింపు చెబుతున్నారని ఆరోపణ**

**రుషికొండ ప్యాలెస్‌కు చదరపు అడుగుకు రూ.35,714 ఖర్చు చేశారని విమర్శ**

**అమరావతి నిర్మాణ పనుల వేగం చూసి ఓర్వలేకపోతున్నారన్న షరీఫ్**



రాజధాని అమరావతి నిర్మాణ వ్యయంపై వైసీపీ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్ తీవ్రంగా విమర్శించారు. అమరావతిలో పనుల వేగాన్ని చూసి ఓర్వలేక, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు జగన్, ఆయన పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన నిన్న మీడియా సమావేశంలో మాట్లాడారు. 'అమరావతి నిర్మాణంలో చదరపు అడుగుకి రూ.6,980 మాత్రమే ఖర్చు అవుతుంటే.. వైఎస్ జగన్ రూ.12,000 నుంచి రూ.14,000 ఖర్చు అవుతుందని తప్పుడు లెక్కలు చెబుతున్నారు,' అని షరీఫ్ స్పష్టం చేశారు. తెలంగాణ సచివాలయ నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.6,500 ఖర్చయిందని, దానితో పోలిస్తే అమరావతి నిర్మాణ వ్యయం సమంజసంగానే ఉందని వివరించారు. ఈ సందర్భంగా రుషికొండ ప్యాలెస్ నిర్మాణ వ్యయాన్ని షరీఫ్ ప్రస్తావించారు. 'ప్రజాధనం రూ.700 కోట్లతో ఋషికొండపై తన సొంత నివాసం కోసం చదరపు అడుగుకి రూ.35,714 ఖర్చు చేసిన జగన్ రెడ్డికి, ప్రజా రాజధానిపై మాట్లాడే అర్హత లేదు,' అని ఆయన కుండబద్దలు కొట్టారు. రాజధానిపై జగన్ అండ్ కో అబద్ధాలు ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు.

## సమావేశంలో పాల్గొన్న హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 02:** నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడవసారి దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా తెలంగాణ రాష్ట్ర పర్యటనకు రానున్న సందర్భంగా మే 10వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగ సభ విజయవంతం చేయుటకు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నాగోల్ శుభం కన్వెన్షన్ హాల్‌లో బూత్ స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రివర్యులు గంగాపురం కిషన్ రెడ్డి , మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి మాట్లాడుతూ, మే 10న జరగబోయే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభను చారిత్రాత్మకంగా నిలిపేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్ స్థాయిలో కార్యకర్తలు చురుకుగా పనిచేసి, పెద్ద ఎత్తున ప్రజలను సభకు తరలించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసి, బీజేపీ పట్ల విశ్వాసాన్ని పెంపొందించాలని తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మాట్లాడుతూ, మే 10న జరిగే సభ తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలుస్తుందని అన్నారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని, అదే అభివృద్ధిని తెలంగాణలోనూ తీసుకురావాలంటే బీజేపీకి మద్దతు అవసరమని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త బాధ్యతగా భావించి యువత, మహిళలు, కొత్త ఓటర్లను సభకు భారీగా తరలించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హయత్ నగర్ బీజేపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్య లో పాల్గొనడం జరిగింది.

## ప్రారంభోత్సవ కార్యక్రమం లో పాల్గొన్నా బి.ఎన్.రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 02:** బి .ఎన్.రెడ్డి నగర్ డివిజన్ సచివాలయ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన మహిళా తీమ్ పార్క్ వద్ద ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద ఏర్పాటు చేసిన తెలంగాణా విజయ డైరీ పార్లర్ ను గౌరవ తెలంగాణా రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ కో - ఆపరేటివ్ ఫెడరేషన్ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంలో మల్కాజిగిరి మున్సిపల్ అడిషనల్ కమీషనర్ రఘు ప్రసాద్ , పి.డి యు.సి.డి సురేష్, బి.ఎన్.రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్, ఎల్.బి.నగర్ యువనాయకులు ముద్దగౌని మనీష్ గౌడ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ విక్రాంత్ రెడ్డి,సి.ఓ రాకేష్, వెంకటేష్ ఆర్.పి.ఎస్, సచివాలయ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పింగళి సాంబశివ రావు, ప్రధాన కార్యదర్శి బాలి రెడ్డి, హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు కూర్మా రావు, మాజీ కౌన్సిలర్ ఉమా శ్రీనివాస్, కాలనీ ప్రతినిధులు ఆంజనేయులు, శ్రీధర్, గోపాల్ రెడ్డి, డైరీ పార్లర్ నిర్వాహకులు పద్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో హోటల్ ఫుడ్ ప్రియులకు షాక్

**10 శాతం పెరగనున్న మెనూ ధరలు**

**వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెంపు**

**ఏపీ స్టార్ హోటళ్లలో 10 శాతం ధరల పెంపునకు నిర్ణయం**

**ప్రకటన చేసిన ఏపీ స్టార్ హోటళ్ల అసోసియేషన్**

**పెరిగిన ఖర్చులతో తప్పడం లేదన్న యాజమాన్యాలు**



వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు భారీగా పెరగడంతో ఆంధ్రప్రదేశ్‌లోని స్టార్ హోటళ్లలో భోజనం ప్రియం కానుంది. పెరిగిన ఖర్చుల భారాన్ని తట్టుకునేందుకు మెనూ ధరలను 10 శాతం వరకు పెంచాలని ఏపీ స్టార్ హోటళ్ల అసోసియేషన్ ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ నిర్ణయం త్వరలోనే అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 19 కేజీల వాణిజ్య సిలిండర్‌పై ఒకేసారి రూ.993 పెంచడం హోటల్ పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపిందని ఆయన తెలిపారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో నష్టాలను ఎదుర్కొంటున్నామని, తాజా గ్యాస్ ధరల పెంపుతో నిర్వహణ మరింత కష్టంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో హోటల్ పరిశ్రమను, దానిపై ఆధారపడిన వేలాది మంది కార్మికుల ఉపాధిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని స్వామి పేర్కొన్నారు. అందుకే, గత్యంతరం లేని పరిస్థితుల్లో ధరలు పెంచాలనే కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వస్తోందని వివరించారు.

## ఇరాన్‌లో పేలుడు 14 మంది రివల్యూషనరీ గార్డ్స్ సైనికుల మృతి

**పాత బాంబులను నిర్వీర్యం చేస్తుండగా చోటుచేసుకున్న ఘటన**

**మృతులు అత్యంత అనుభవజ్ఞులైన సిబ్బందిగా గుర్తింపు**

**యుద్ధం తర్వాత మిగిలిన బాంబులతో కొనసాగుతున్న ముప్పు**

**ఏప్రిల్ 8 కాల్పుల విరమణ తర్వాత ఇదే అతిపెద్ద నష్టం**

ఇరాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. దేశ వాయవ్య ప్రాంతంలోని జాంజన్ ప్రావిన్స్‌లో సంభవించిన ఓ పేలుడులో 14 మంది ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ సభ్యులు మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఇటీవలి యుద్ధంలో పేలకుండా మిగిలిపోయిన బాంబులను తొలగిస్తుండగా శుక్రవారం ఈ దుర్ఘటన జరిగింది. జాంజన్ నగర సమీపంలో ఐఆర్‌జీసీకి చెందిన బాంబు నిర్వీర్య బృందాలు క్లియరెన్స్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఏడాది జరిగిన యుద్ధంలో అమెరికా, ఇజ్రాయెల్ దళాలు జారవిడిచిన క్లస్టర్ బాంబులు, ఇతర పేలుడు పదార్థాలను గుర్తించి, నిర్వీర్యం చేసే పనిలో ఉండగా ప్రమాదవశాత్తు ఓ బాంబు పేలింది. మరణించిన వారిలో అత్యంత అనుభవజ్ఞులైన, ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది ఉన్నారని ఐఆర్‌జీసీ అన్సార్ అల్-మహదీ యూనిట్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై వైమానిక దాడులు ప్రారంభించడంతో యుద్ధం మొదలైంది. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్, ఇతర ప్రాంతాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు చేసింది. అనంతరం ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. యుద్ధం ముగిసినప్పటికీ, పేలని బాంబుల ముప్పు ఇంకా తొలగిపోలేదని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. కాల్పుల విరమణ తర్వాత ఐఆర్‌జీసీకి ఇదే అతిపెద్ద నష్టం. ఇప్పటివరకు దాదాపు 15,000కు పైగా పేలని బాంబులను నిర్వీర్యం చేసినట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. జాంజన్ ప్రావిన్స్‌లోనే సుమారు 1,200 హెక్టార్ల వ్యవసాయ భూములు ఈ బాంబుల కారణంగా ప్రమాదకరంగా మారాయని అధికారులు వెల్లడించారు.

# తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు శుభవార్త

**ఆర్టీసీ కార్మికుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం**

**మూడు రోజుల సమ్మె కాలాన్ని రెగ్యులర్ డ్యూటీగా పరిగణిస్తామని వెల్లడి**

**కార్మికులపై పెట్టిన పోలీసు కేసులను కూడా ఎత్తివేయాలని ఆదేశం**

**వెంటనే చర్యలు తీసుకోవాలని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సీఎం సూచన**

**వెయ్యి కొత్త ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయనున్నట్లు ప్రకటన**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. ఇటీవల కార్మికులు చేపట్టిన మూడు రోజుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ కాలాన్ని రెగ్యులర్ డ్యూటీగా పరిగణించనున్నట్లు సీఎం స్పష్టం చేశారు. అదేవిధంగా, సమ్మె సమయంలో కార్మికులపై నమోదు చేసిన పోలీసు కేసులను కూడా ఉపసంహరించుకోవాలని ఆయన ఆదేశించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో నిన్న టీజీఎస్ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారు. సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని, కేసులు ఎత్తివేయాలని కార్మిక సంఘాల నేతలు చేసిన విజ్ఞప్తికి సీఎం సానుకూలంగా స్పందించారు. ఈ హామీల అమలుకు తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలను 100 శాతం పరిష్కరించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. సంస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా రూ.8,000 కోట్లు అందించిందని, ఉద్యోగుల బకాయిల కోసం రూ.1,000 కోట్లు విడుదల చేసిందని గుర్తుచేశారు. అలాగే, మెట్రో రైల్ నెట్‌వర్క్‌కు అనుసంధానంగా 1,000 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. శంషాబాద్ సమీపంలోని బహదూర్‌గూడలో 150 ఎకరాల్లో, గజులరామారంలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ సంఘాల నేతలు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పూడి శ్రీహరి కేసు.. నల్లపాడు పోలీసులకు హైకోర్టు సూచనలు

**శ్రీహరి విషయంలో చట్టప్రకారం నడుచుకోవాలన్న హైకోర్టు**

**సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని సూచన**

**తదుపరి చర్యలన్నీ చట్టబద్ధంగా ఉండాలని ఆదేశం**



ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత పోస్టు పెట్టిన కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ నేత, ఆ పార్టీ మీడియా కోఆర్డినేటర్ పూడి శ్రీహరి విషయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టుల నేపథ్యంలో నమోదైన కేసులపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు, పోలీసులకు కీలక ఆదేశాలిచ్చారు. శ్రీహరి విషయంలో చట్టప్రకారం నడుచుకోవాలని గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులకు స్పష్టం చేస్తూ, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఆయనను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచిన నేపథ్యంలో, తదుపరి చర్యలన్నీ చట్టబద్ధంగా ఉండాలని కోర్టు ఆదేశించింది. తనపై నల్లపాడు, కొత్తపేట పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను కొట్టివేయాలని కోరుతూ శ్రీహరి దాఖలు చేసిన పిటిషన్లపై సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. ఏడు ఏళ్ల లోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినప్పటికీ, కుప్పం కేసులో విడుదలైన వెంటనే పోలీసులు మళ్లీ అరెస్ట్ చేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. మరోవైపు, పిటిషనర్ దర్యాప్తుకు సహకరించడం లేదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు, చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది.

# చెరువుల పునరుద్ధరణ బాధితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు

**హైడ్రా కమిషనర్ హామీ**

**సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ హామీ**

**గూగుల్ మ్యాప్స్ ఆధారంగా 2024 జులై 19కి ముందున్న వారి గుర్తింపు**

**బడా కబ్జాదారులపై కఠినంగా, నిరుపేదలకు అండగా ఉంటామన్న ప్రభుత్వం**

**సున్నం, రామంతాపూర్ చెరువుల బాధితులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం**



గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చెరువులను పునరుద్ధరించి, కబ్జాల నుంచి విముక్తి చేసే బృహత్తర కార్యక్రమంలో భాగంగా నివాసాలు కోల్పోతున్న నిరుపేదల పట్ల తెలంగాణ ప్రభుత్వం మానవతా దృక్పథంతో కీలక నిర్ణయం తీసుకుంది. చెరువులను ఆక్రమించిన బడా కబ్జాదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూనే, జీవనోపాధి కోసం వచ్చి గుడిసెలు వేసుకున్న పేదలకు అన్యాయం జరగకూడదన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వారికి అండగా నిలవనుంది. చెరువుల పునరుద్ధరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన అర్హులైన ప్రతి పేద కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయించనున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. శుక్రవారం మాదాపూర్‌లోని సున్నం చెరువు, రామంతాపూర్ చెరువు ప్రాంతాల బాధితులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై ఈ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో బాధితుల గుర్తింపు ప్రక్రియను హైడ్రా వేగవంతం చేసింది. ఈ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా కేవలం అర్హులైన వారికే ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం సాంకేతికతను వినియోగిస్తోంది. 2024 జులై 19వ తేదీని కటాఫ్‌గా నిర్ణయించి, ఆ తేదీకి ముందు నుంచే అక్కడ నివాసం ఉంటున్న వారిని గూగుల్ మ్యాప్స్, శాటిలైట్ చిత్రాల ఆధారంగా గుర్తించి జాబితాలు సిద్ధం చేస్తున్నారు. ఈ విధానం వల్ల పేదల ముసుగులో లబ్ధి పొందాలనుకునే కబ్జాదారుల ప్రయత్నాలకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు భావిస్తున్నారు. నగరవ్యాప్తంగా చెరువుల వద్ద ఇళ్లు కోల్పోయిన వారందరికీ ఇదే నిబంధన వర్తిస్తుందని కమిషనర్ రంగనాథ్ తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో కమిషనర్ బాధితుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కోసం నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు పొరుగున ఉన్న ఏపీ నుంచి వలస వచ్చి, చెత్త ఏరుకుంటూ జీవిస్తున్న వారే అధికంగా ఉన్నట్లు గుర్తించారు. బయట అద్దె ఇళ్లు దొరకని పరిస్థితుల్లోనే చెరువుల దగ్గర తలదాచుకోవాల్సి వచ్చిందని బాధితులు తమ ఆవేదనను వెళ్లగక్కారు. దీనిపై స్పందించిన రంగనాథ్, ప్రభుత్వం వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు శాశ్వత గృహవసతి కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పక్కా ఆధారాలతో నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, హైడ్రా ఇప్పటికే నగరంలో అనేక చెరువులను పునరుద్ధరించి, వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఇటీవల చెన్నై నుంచి వచ్చిన ఓ బృందం హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించడం గమనార్హం.

# సహజీవనం చేస్తున్న జంటలో రీచార్జ్ చిచ్చు

**ఉరేసుకున్న ప్రియురాలు**

**హైదరాబాద్‌లోని జీడిమెట్ల పరిధిలో ఘటన**

**సహజీవనం చేస్తున్న జంట మధ్య రీచార్జ్ విషయంలో వాగ్వాదం**

**ప్రియుడు ఫోన్ రీచార్జ్ చేయించలేదని యువతి ఆత్మహత్య**



ప్రియుడు మొబైల్ ఫోన్‌కు రీచార్జ్ చేయించలేదన్న మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హైదరాబాద్ నగరంలోని జీడిమెట్లలో చోటుచేసుకుంది. కుత్బుల్లాపూర్ ప్రశాంత్ నగర్‌లో కిరణ్మయి అనే యువతి నివాసం ఉంటోంది. గతంలో ఆమెకు వివాహమై విడాకులు తీసుకుంది. వీరికి ఒక కుమారుడు ఉండగా, అతను కిరణ్మయి తల్లి వద్ద పెరుగుతున్నాడు. ఈ క్రమంలో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న ఆమెకు వెంకటేశ్ అలియాస్ చందూ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఏడాది కాలంగా వీరిద్దరూ సహజీవనం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం కిరణ్మయి ఫోన్ రీచార్జ్ గడువు ముగిసింది. జీతం ఇంకా రాకపోవడంతో తన ప్రియుడు వెంకటేశ్‌ను రీచార్జ్ చేయించమని కోరింది. అందుకు అతను నిరాకరించడంతో శుక్రవారం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన కిరణ్మయి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. చిన్న గొడవకే యువతి ప్రాణాలు తీసుకోవడంపై పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు.

# అమరావతి ఖర్చుపై వైకాపా దుష్ప్రచారం

**రుషికొండ లెక్కలు గుర్తుచేసిన షరీఫ్**

**అమరావతి నిర్మాణ వ్యయంపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందన్న ఎంఏ షరీఫ్**

**చదరపు అడుగుకు రూ.6,980 ఖర్చవుతుంటే, జగన్ రెట్టింపు చెబుతున్నారని ఆరోపణ**

**రుషికొండ ప్యాలెస్‌కు చదరపు అడుగుకు రూ.35,714 ఖర్చు చేశారని విమర్శ**

**అమరావతి నిర్మాణ పనుల వేగం చూసి ఓర్వలేకపోతున్నారన్న షరీఫ్**



రాజధాని అమరావతి నిర్మాణ వ్యయంపై వైసీపీ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్ తీవ్రంగా విమర్శించారు. అమరావతిలో పనుల వేగాన్ని చూసి ఓర్వలేక, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు జగన్, ఆయన పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన నిన్న మీడియా సమావేశంలో మాట్లాడారు. 'అమరావతి నిర్మాణంలో చదరపు అడుగుకి రూ.6,980 మాత్రమే ఖర్చు అవుతుంటే.. వైఎస్ జగన్ రూ.12,000 నుంచి రూ.14,000 ఖర్చు అవుతుందని తప్పుడు లెక్కలు చెబుతున్నారు,' అని షరీఫ్ స్పష్టం చేశారు. తెలంగాణ సచివాలయ నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.6,500 ఖర్చయిందని, దానితో పోలిస్తే అమరావతి నిర్మాణ వ్యయం సమంజసంగానే ఉందని వివరించారు. ఈ సందర్భంగా రుషికొండ ప్యాలెస్ నిర్మాణ వ్యయాన్ని షరీఫ్ ప్రస్తావించారు. 'ప్రజాధనం రూ.700 కోట్లతో ఋషికొండపై తన సొంత నివాసం కోసం చదరపు అడుగుకి రూ.35,714 ఖర్చు చేసిన జగన్ రెడ్డికి, ప్రజా రాజధానిపై మాట్లాడే అర్హత లేదు,' అని ఆయన కుండబద్దలు కొట్టారు. రాజధానిపై జగన్ అండ్ కో అబద్ధాలు ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు.

# ఏపీలో హోటల్ ఫుడ్ ప్రియులకు షాక్

**10 శాతం పెరగనున్న మెనూ ధరలు**

**వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెంపు**

**ఏపీ స్టార్ హోటళ్లలో 10 శాతం ధరల పెంపునకు నిర్ణయం**

**ప్రకటన చేసిన ఏపీ స్టార్ హోటళ్ల అసోసియేషన్**

**పెరిగిన ఖర్చులతో తప్పడం లేదన్న యాజమాన్యాలు**



వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు భారీగా పెరగడంతో ఆంధ్రప్రదేశ్‌లోని స్టార్ హోటళ్లలో భోజనం ప్రియం కానుంది. పెరిగిన ఖర్చుల భారాన్ని తట్టుకునేందుకు మెనూ ధరలను 10 శాతం వరకు పెంచాలని ఏపీ స్టార్ హోటళ్ల అసోసియేషన్ ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ నిర్ణయం త్వరలోనే అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 19 కేజీల వాణిజ్య సిలిండర్‌పై ఒకేసారి రూ.993 పెంచడం హోటల్ పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపిందని ఆయన తెలిపారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో నష్టాలను ఎదుర్కొంటున్నామని, తాజా గ్యాస్ ధరల పెంపుతో నిర్వహణ మరింత కష్టంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో హోటల్ పరిశ్రమను, దానిపై ఆధారపడిన వేలాది మంది కార్మికుల ఉపాధిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని స్వామి పేర్కొన్నారు. అందుకే, గత్యంతరం లేని పరిస్థితుల్లో ధరలు పెంచాలనే కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వస్తోందని వివరించారు.

# ఇరాన్‌లో పేలుడు 14 మంది రివల్యూషనరీ గార్డ్స్ సైనికుల మృతి

**పాత బాంబులను నిర్వీర్యం చేస్తుండగా చోటుచేసుకున్న ఘటన**

**మృతులు అత్యంత అనుభవజ్ఞులైన సిబ్బందిగా గుర్తింపు**

**యుద్ధం తర్వాత మిగిలిన బాంబులతో కొనసాగుతున్న ముప్పు**

**ఏప్రిల్ 8 కాల్పుల విరమణ తర్వాత ఇదే అతిపెద్ద నష్టం**



ఇరాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. దేశ వాయవ్య ప్రాంతంలోని జాంజన్ ప్రావిన్స్‌లో సంభవించిన ఓ పేలుడులో 14 మంది ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ సభ్యులు మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఇటీవలి యుద్ధంలో పేలకుండా మిగిలిపోయిన బాంబులను తొలగిస్తుండగా శుక్రవారం ఈ దుర్ఘటన జరిగింది. జాంజన్ నగర సమీపంలో ఐఆర్‌జీసీకి చెందిన బాంబు నిర్వీర్య బృందాలు క్లియరెన్స్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఏడాది జరిగిన యుద్ధంలో అమెరికా, ఇజ్రాయెల్ దళాలు జారవిడిచిన క్లస్టర్ బాంబులు, ఇతర పేలుడు పదార్థాలను గుర్తించి, నిర్వీర్యం చేసే పనిలో ఉండగా ప్రమాదవశాత్తు ఓ బాంబు పేలింది. మరణించిన వారిలో అత్యంత అనుభవజ్ఞులైన, ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది ఉన్నారని ఐఆర్‌జీసీ అన్సార్ అల్-మహదీ యూనిట్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై వైమానిక దాడులు ప్రారంభించడంతో యుద్ధం మొదలైంది. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్, ఇతర ప్రాంతాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు చేసింది. అనంతరం ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. యుద్ధం ముగిసినప్పటికీ, పేలని బాంబుల ముప్పు ఇంకా తొలగిపోలేదని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. కాల్పుల విరమణ తర్వాత ఐఆర్‌జీసీకి ఇదే అతిపెద్ద నష్టం. ఇప్పటివరకు దాదాపు 15,000కు పైగా పేలని బాంబులను నిర్వీర్యం చేసినట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. జాంజన్ ప్రావిన్స్‌లోనే సుమారు 1,200 హెక్టార్ల వ్యవసాయ భూములు ఈ బాంబుల కారణంగా ప్రమాదకరంగా మారాయని అధికారులు వెల్లడించారు.

# చరిత్ర సృష్టించిన ఏడేళ్ల బాలుడు

**పాక్ జలసంధిపై భారత పతాకం**

**పాక్ జలసంధిని ఈదిన ఇషాంక్ సింగ్**

**ఈ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు**

**29 కిలోమీటర్ల దూరాన్ని 9 గంటల 50 నిమిషాల్లో పూర్తిచేసిన వైనం**



ఝార్ఖండ్‌కు చెందిన ఏడేళ్ల బాలుడు ఇషాంక్ సింగ్ సముద్రంలో అద్భుతం చేసి చరిత్ర సృష్టించాడు. భారత్, శ్రీలంక మధ్యనున్న పాక్ జలసంధిని ఈది, ఈ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. శుక్రవారం జరిగిన ఈ సాహసయాత్రలో ఇషాంక్ 29 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 9 గంటల 50 నిమిషాల్లో పూర్తి చేశాడు. శ్రీలంకలోని తలైమన్నార్ వద్ద శుక్రవారం ఉదయం 4 గంటలకు తన ఈతను ప్రారంభించిన ఇషాంక్ బలమైన సముద్ర ప్రవాహాలు, అలలను అధిగమించి మధ్యాహ్నం 1:50 గంటలకు తమిళనాడులోని ధనుష్కోడి సమీపంలోని అరిచల్మునై తీరానికి చేరుకున్నాడు. తీరానికి చేరుకున్న ఇషాంక్‌కు అధికారులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ విజయంతో 2019లో 10 ఏళ్ల వయసులో 10 గంటల 30 నిమిషాల్లో పాక్ జలసంధిని ఈదిన తమిళనాడుకు చెందిన జై జశ్వంత్ రికార్డును ఇషాంక్ బద్దలు కొట్టాడు. ఇషాంక్ విజయంపై ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఎక్స్ ద్వారా ప్రశంసలు కురిపించారు. "ఇషాంక్ అసాధారణ ప్రతిభావంతుడు. అతడి క్రమశిక్షణ, అంకితభావం ఝార్ఖండ్‌కే కాకుండా దేశం మొత్తానికే గర్వకారణం" అని ఆయన పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో కొత్త 'షార్ట్ కట్' రోడ్లు!



రియల్ ఎస్టేట్ లో తర్వాతి హాట్ స్పాట్స్ ఇవే!భాగ్యనగరం హైదరాబాద్‌శరవేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక భారీ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఔటర్ రింగ్ రోడ్ , మూసీ కారిడార్‌ను కలుపుతూ 7 కొత్త లింక్ రోడ్లను నిర్మించనున్నారు. ఏయే ప్రాంతాలకు లబ్ధి చేకూరుతుంది ముఖ్యంగా బుద్వేల్, కొత్తవాల్‌గూడ, , గండిపేట వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు ఈ కొత్త రోడ్లు వరంగా మారనున్నాయి. ఈ ప్రాంతాల్లో ఇప్పటికే అనేక భారీ ఎవీణూ లేఅవుట్లు , రెసిడెన్షియల్ ప్రాజెక్టులు వస్తున్నాయి. కొత్త రోడ్ల వల్ల ఈ ప్రాంతాల నుండి సిటీ లోపలికి లేదా విమానాశ్రయానికి వెళ్లడం చాలా సులభం అవుతుంది. ప్రతిపాదిత 7 కొత్త రోడ్లు ఇవే.. ప్రభుత్వం సిద్ధం చేసిన మాస్టర్ ప్లాన్ ప్రకారం ఈ కింది రూట్లలో రోడ్లు రాబోతున్నాయి.. ఒస్మాన్ సాగర్ నుండి నార్సింగి: 5.4 కిలోమీటర్లు (30 మీటర్ల వెడల్పు) ఒస్మాన్ సాగర్ నుండి సర్వీస్ రోడ్: 2.3 కిలోమీటర్లు కిస్మత్‌పూర్ బ్రిడ్జ్ నుండి బుద్వేల్ లేఅవుట్: 1.1 కిలోమీటర్లు బుద్వేల్ లేఅవుట్ నుండి శివమ్ రోడ్: 3.5 కిలోమీటర్లు రాజేంద్రనగర్ పోలీస్ క్వార్టర్స్ నుండి ఎయిర్‌పోర్ట్ రోడ్ (శంషాబాద్): 5 కిలోమీటర్లు కిస్మత్‌పూర్ బ్రిడ్జ నుండి బుద్వేల్ లేఅవుట్ : 3 కిలోమీటర్లు ఇస్తానా విల్లాస్ నుండి గండిపేట రోడ్: 1.2 కిలోమీటర్లు రియల్ ఎస్టేట్‌పై ప్రభావం సాధారణంగా ఎక్కడైతే కనెక్టివిటీ పెరుగుతుందో, అక్కడ భూముల ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఈ 7 కొత్త రోడ్ల వల్ల గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో ఎఎవతీఘుఘు రియల్ ఎస్టేట్ మార్కెట్ మరింత పుంజుకోనుంది. కొత్తగా ఇల్లు లేదా ప్లాట్లు కొనాలనుకునే వారికి ఇవి హాట్ స్పాట్‌లుగా మారనున్నాయి. ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారం ప్రస్తుతం ఔటర్ రింగ్ రోడ్ నుండి నగరం లోపలికి రావాలంటే కొన్ని ప్రధాన జంక్షన్ల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ 7 లింక్ రోడ్లు "షార్ట్ కట్" మార్గాలుగా పనిచేస్తాయి. దీనివల్ల ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, ఇంధనం కూడా ఆదా అవుతుంది. 2047 నాటి ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ రోడ్లను డిజైన్ చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా రాబోతున్న ఈ మౌలిక సదుపాయాలు హైదరాబాద్ భవిష్యత్తును మార్చబోతున్నాయి. ఈ ప్రాజెక్టు కేవలం ఏడు రహదారుల నిర్మాణం మాత్రమే కాదు, ఇది హైదరాబాద్ నగరం వెలుపలి వైపు ఏ విధంగా విస్తరించబోతోంది అనే దానికి ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్. సాధారణంగా మెట్రో నగరాల్లో రింగ్ రోడ్లు అభివృద్ధి చెందాక, నగరం లోపలి భాగాలకు, రింగ్ రోడ్డుకు మధ్య కనెక్టివిటీ లేక ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుంటాయి. ఈ గ్యాప్‌ను భర్తీ చేయడమే ఈ 7 లింక్ రోడ్ల ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం చేపట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ పునరుద్ధరణ ప్రాజెక్టులో భాగంగా ఈ రహదారులు రాబోతుండటం వల్ల, మూసీ పరివాహక ప్రాంతం అర్బన్ హబ్‌గా మారే అవకాశం ఉంది. 2047 నాటి ట్రాఫిక్ అంచనాలను దృష్టిలో ఉంచుకుని, 100 నుండి 120 అడుగుల వెడల్పుతో ఈ రోడ్లను రూపొందిస్తుండటం భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా ఉంది.

# హైదరాబాద్ ఎండలు ప్రాణాలు కాపాడుకోవడానికి ఈ జాగ్రత్తలు తప్పనిసరి!



హైదరాబాద్‌ను భానుడు భయపెడుతున్నాడు. నగరంలో ఎండలు మండిపోతుండటంతో వాతావరణ శాఖ ఏప్రిల్ 16 వరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నగరం అంతటా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చాలా ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నీరు, విద్యుత్ వినియోగంపై తీవ్ర ఒత్తిడి పడనుండటంతో నగరవాసులు, బిల్డర్లు అప్రమత్తమవుతున్నారు. ఈ సవాల్‌తో కూడిన వారంలో నిత్యావసర వనరుల కొరత రాకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.ముఖ్యంగా ఉప్పల్, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో ఎండ ప్రభావం అప్పుడే స్పష్టంగా కనిపిస్తోంది. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌ల నుంచి జలమండలి పోర్టల్ ద్వారా వాటర్ ట్యాంకర్ల బుకింగ్స్ భారీగా పెరిగాయి. నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు అనవసర వినియోగంపై ఆంక్షలు విధిస్తున్నాయి. ప్రతి ఇంటికీ కనీస అవసరాలకు సరిపడా నీరు అందాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయాలు తీసుకుంటున్నారు.హైదరాబాద్ ఎండలు: నీటి పొదుపు ఇలా..సాయంత్రం వేళ నీటి కొరత రాకుండా ఉండాలంటే అద్దెదారులు, యజమానులు నీటిని నిల్వ చేసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అటు బిల్డర్లు కూడా మధ్యాహ్నం ఎండ నుంచి కార్మికులను రక్షించేందుకు పని వేళల్లో మార్పులు చేస్తున్నారు. చాలా చోట్ల మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు పనులను నిలిపివేస్తున్నారు. ఇలాంటి చిన్న చిన్న మార్పులు కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా, పనులు సురక్షితంగా సాగేలా చేస్తాయి.యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్: చిన్న స్టార్టప్‌లు కోట్లు ఎలా సంపాదిస్తున్నాయి?యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్: చిన్న స్టార్టప్‌లు కోట్లు ఎలా సంపాదిస్తున్నాయి?విద్యుత్ వినియోగం.. జాగ్రత్తలు ఇవే!ఎండల ధాటికి ఏసీల వాడకం పెరగడంతో విద్యుత్ డిమాండ్ అమాంతం పెరుగుతోంది. పవర్ గ్రిడ్‌పై భారం పడకుండా ఉండాలంటే ఏసీలను 24 డిగ్రీల వద్ద సెట్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే, లోడ్‌ను తట్టుకునేలా వైరింగ్ వ్యవస్థ ఉందో లేదో యజమానులు ఒకసారి చెక్ చేసుకోవాలి. సరైన మెయింటెనెన్స్ ఉంటేనే వేసవిలో తరచూ వచ్చే పవర్ కట్స్ సమస్య నుంచి తప్పించుకోవచ్చు.ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు తగినంత నీరు తాగుతూ ఇంట్లోనే ఉండటం సురక్షితం. ఎప్పటికప్పుడు వాతావరణ అప్‌డేట్స్ గమనిస్తూ, అధికారులు ఇచ్చే ఆరోగ్య సూచనలను పాటించాలి. ఈ ఆరెంజ్ అలర్ట్ సమయంలో నగరవాసుల సహకారం ఎంతో కీలకం. ముందస్తుగా సిద్ధమైతేనే ఉష్ణోగ్రతలు తగ్గే వరకు ఎండల నుంచి ఉపశమనం పొందవచ్చు.

# బెంగళూరులో రూ. 500తో రోజంతా గడపడం సాధ్యమేనా


## ఈ యువతి ఏం చేసిందో చూడండి!

భారతదేశంలో అత్యంత ఖరీదైన నగరాల్లో బెంగళూరు ఒకటి. ఇక్కడ అడుగు పెడితే చాలు.. క్యాబ్ చార్జీల దగ్గర నుంచి హోటల్ బిల్లుల వరకు అన్నీ చుక్కలు చూపిస్తుంటాయి. సామాన్యుడు ఇక్కడ సర్వైవ్ అవ్వడం అంత ఈజీ కాదనేది అందరి మాట. అయితే, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రియాంక మొండల్ అనే యువతి ఈ అంచనాలను తిరగరాసింది. కేవలం 500 రూపాయల బడ్జెట్‌తో గార్డెన్ సిటీలో ఒక రోజంతా గడపగలమా? అనే ఆసక్తికరమైన ప్రయోగాన్ని చేసి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.తక్కువతో మొదలై.. మెట్రోతో సాగి..ప్రియాంక తన రోజును చాలా సింపుల్‌గా ప్రారంభించింది. ఉదయం టిఫిన్ కోసం తక్కువ ధరలో దొరికే ఇడ్లీలను ఎంచుకుంది. ఇక రవాణా విషయానికి వస్తే, బెంగళూరులో ఊబర్, ఓలా వంటి క్యాబ్‌లు బుక్ చేస్తే వందల రూపాయలు ఖర్చవుతాయని అందరికీ తెలిసిందే. అందుకే ఆమె తెలివిగా మెట్రో రైలును ఆశ్రయించింది. దీనివల్ల ప్రయాణ ఖర్చులు భారీగా తగ్గాయి. మధ్యలో ఒక చిన్న టీ బ్రేక్ తీసుకుంటూ తన ప్రయాణాన్ని కొనసాగించింది. బెంగళూరులో రూ. 5 వేలకే రూమ్..ఈ ఏరియాలోకి రమ్మని పిలుస్తున్న ఇంటి ఓనర్లు..లంచ్ టైమ్ షాక్!అయితే, మధ్యాహ్నం భోజనం సమయానికి ప్రియాంకకు అసలైన సవాలు ఎదురైంది. బెంగళూరు లోని ఒక హోటల్‌లో మెనూ చూడగానే రేట్లు చూసి ఆమె ఒక్కసారిగా షాక్‌కు గురైంది. సామాన్యమైన భోజనం కూడా చాలా కాస్ట్లీగా అనిపించింది. అయినప్పటికీ, వెనక్కి తగ్గకుండా తన బడ్జెట్ పరిమితిని దృష్టిలో పెట్టుకుని, కేవలం 120 రూపాయలలోనే తన లంచ్ పూర్తి చేసింది.




పక్కా ప్లానింగ్ ఉంటే ఏదైనా సాధ్యమేనని ఆమె నిరూపించింది.మిగిలిన డబ్బుతో సేఫ్..సాయంత్రం వేళ ఆకలి వేసినప్పుడు భారీ రెస్టారెంట్లకు వెళ్లకుండా, ఒక వడపావ్ , టీతో సరిపెట్టుకుంది. అప్పటికే తన బడ్జెట్ దాదాపు అయిపోవచ్చని గ్రహించిన ప్రియాంక, వెంటనే ఇంటికి తిరుగు ప్రయాణమైంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటం టే, 500 రూపాయల బడ్జెట్ పెట్టుకుంటే, రోజు చివరలో ఆమె చేతిలో ఇంకా 200 రూపాయలు మిగిలాయి. అంటే కేవలం 300 రూపాయలతోనే ఆమె తన రోజును విజయవంతంగా ముగించింది .సోషల్ మీడియా స్పందన ప్రియా ంక షేర్ చేసిన ఈ వీడియోపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. "ఇందిరా క్యాంటీన్లకు వెళ్తే కేవలం 30 రూపాయలకే భోజనం దొరుకుతుంది, ఇంకా తక్కువలో పూర్తి చేయొచ్చు" అని కొందరు సలహాలు ఇస్తుంటే, "మేము కూడా ఇలాంటి బడ్జెట్ ప్లానింగ్ పాటిస్తాం" అని మరికొందరు కామెంట్ చేస్తున్నారు. యాపిల్ కంపెనీలో ఉద్యోగం.. లక్షల్లో జీతం.. కానీ ఈ టెక్కీ ఆటో ఎందుకు నడుపుతున్నాడో తెలుసా యాపిల్ కంపెనీలో ఉద్యోగం.. లక్షల్లో జీతం.. కానీ ఈ టెక్కీ ఆటో ఎందుకు నడుపుతున్నాడో తెలుసామొత్తానికి, ఎంత ఖరీదైన నగరమైనా సరే, అనవసర ఖర్చులకు పోకుండా ప్లాన్ చేసుకుంటే తక్కువతో బతకడం సాధ్యమేనని ప్రియాంక స్టోరీ నిరూపిస్తోంది. బెంగళూరు లాంటి నగరాల్లో జీవన ప్రమాణాలు పెరగడం వల్ల ఖర్చులు ఆకాశాన్ని తాకుతున్న మాట నిజమే. అయితే, విలాసాల కంటే అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ.. క్యాబ్‌లకు బదులు మెట్రో, స్టార్ హోటళ్లకు బదులు స్థానిక టిఫిన్ సెంటర్లను ఎంచుకుంటే ఖచ్చితంగా డబ్బు ఆదా చేయవచ్చు. ఈ వీడియో చూసిన నెటిజన్లు కూడా "ఖర్చు అనేది మనం ఉండే నగరం మీద మాత్రమే కాదు, మనం చేసే ఖర్చు చేసే పద్ధతి మీద కూడా ఆధారపడి ఉంటుంది" అని అభిప్రాయపడుతున్నారు

# హైదరాబాద్‌లో డ్రైవర్ లేని పాడ్ టాక్సీలు! ఆ ఏరియా వాళ్లకు పండగే!



## హైదరాబాద్ అంటేనే ఐటీ హబ్

హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏరియాల్లో ఉదయం, సాయంత్రం ఆఫీసు వేళల్లో ట్రాఫిక్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మెట్రో స్టేషన్ వరకు బానే చేరుకుంటున్నాం కానీ, అక్కడ దిగాక ఆఫీసుకి వెళ్లడానికి సరైన రవాణా సౌకర్యం లేక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ఈ 'లాస్ట్ మైల్ కనెక్టివిటీ' సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఒక అద్భుతమైన ప్లాన్ తో ముందుకు వచ్చింది. అదే 'పర్సనల్ రాపిడ్ ట్రాన్సిట్' లేదా మనం వాడుక భాషలో చెప్పుకునే 'పాడ్ టాక్సీలు'.ఏమిటీ పాడ్ టాక్సీ ప్రాజెక్ట్‌పాడ్ టాక్సీలు అంటే డ్రైవర్ అవసరం లేని చిన్నపాటి ఎలక్ట్రిక్ వాహనాలు. ఇవి ప్రత్యేకంగా నిర్మించిన ట్రాక్‌లపై (ఎలివేటెడ్ కారిడార్స్) నడుస్తాయి. ఇవి చూడటానికి చిన్న కార్లలా ఉండి, ఒకేసారి నలుగురు నుంచి ఆరుగురు ప్రయాణించడానికి వీలుగా ఉంటాయి. మీరు మెట్రో స్టేషన్ దిగిన వెంటనే ఈ పాడ్ టాక్సీ ఎక్కి నేరుగా మీ ఆఫీసు వద్దకో లేదా నిర్దేశించిన పాయింట్ వద్దకో చేరుకోవచ్చు. రియల్ ఎస్టేట్‌లో మారిన లెక్కలు! బెంగళూరు, హైదరాబాద్‌లో ట్రెండ్ ఎలా ఉందంటే..ఏ ఏ ప్రాంతాలను కలుపుతుందిప్రస్తుత ప్లాన్ ప్రకారం, హైదరాబాద్‌లోని అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలను ఈ నెట్‌వర్క్ అనుసంధానిస్తుంది. ముఖ్యంగా..హైటెక్ సిటీ , రాయదుర్గం మెట్రో స్టేషన్లు. నాలెడ్జ్ సిటీ , ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్. తెలంగాణ రాష్ట్ర సచివాలయం పరిసరాలు. రాయదుర్గం నుంచి కూకట్‌పల్లి కారిడార్.ఈ ప్రాంతాలన్నీ ఐటీ కంపెనీలు, పెద్ద పెద్ద వ్యాపార సముదాయాలతో నిండి ఉంటాయి. ఇక్కడ ఫుట్‌ఫాల్ (జనాల తాకిడి) చాలా ఎక్కువ. కాబట్టి, ఈ ప్రాంతాల్లో పాడ్ టాక్సీలు అందుబాటులోకి వస్తే సామాన్యులకు, ఉద్యోగులకు ప్రయాణం చాలా సులువు అవుతుంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ జోరు! అలాంటి ఇళ్లకే ఫుల్ డిమాండ్!ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితి ఏమిటిఈ భారీ ప్రాజెక్ట్ కోసం ఇప్పటికే ముగ్గురు కన్సల్టెంట్స్ (ాజూూ ాంంశీఎఱఖ్వం, బిడ్లు దాఖలు చేశారు. వీరు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, ప్రాజెక్ట్ ఎంత వరకు లాభదాయకం? ఎక్కడెక్కడ ట్రాకులు నిర్మించాలి? సాంకేతికత ఎలా ఉండాలి? అనే అంశాలపై నివేదిక ఇస్తారు. ఈ ప్రాజెక్టును పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అంటే ప్రభుత్వం , ప్రైవేట్ సంస్థలు కలిసి దీనిని నిర్మించి, నిర్వహిస్తాయి.ప్రయాణికులకు కలిగే ప్రయోజనాలుసాధారణ బస్సులు లేదా ఆటోల కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా, ఈ పాడ్ టాక్సీలు నిరంతరం అందుబాటులో ఉంటాయి. ఇది ఎలక్ట్రిక్ వాహనం కావడం వల్ల కాలుష్యం ఉండదు. పైగా, గాలిలో ప్రత్యేక ట్రాక్‌లపై వెళ్తాయి కాబట్టి కింద రోడ్డుపై ఉండే ట్రాఫిక్ జామ్‌లతో అస్సలు సంబంధం ఉండదు. ముంబై వంటి నగరాల్లో కూడా ఇలాంటి ప్రాజెక్టుల గురించి చర్చ జరుగుతోంది, కానీ హైదరాబాద్ నగరం ఈ విషయంలో ఒక అడుగు ముందే ఉంది. త్వరలోనే ఈ కల సాకారమైతే, భాగ్యనగరం ప్రపంచ స్థాయి నగరాల జాబితాలో మరో మెట్టు ఎక్కుతుంది.

# భారత్‌లోకి భారీగా పెట్టుబడులు

**' డిక్లరేషన్'కు 88 దేశాల సంతకాలు అశ్వినీ వైష్ణవ్**

**దిల్లీ వేదికగా జరిగిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో**

**దిల్లీ డిక్లరేషన్‌కు ఏకగ్రీవ ఆమోదం**



కృత్రిమ మేధ భవిష్యత్తుపై అంతర్జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం కుదిరింది. భారత్ నేతృత్వంలో జరిగిన 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో రూపొందించిన 'దిల్లీ డిక్లరేషన్' కు ప్రపంచ అగ్రరాజ్యాలైన అమెరికా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్, రష్యాతో సహా మొత్తం 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు తమ మద్దతును తెలిపినట్లు కేంద్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఏఐ లక్ష్యాల సహకారంలో ఇదొక మైలురాయిగా పేర్కొన్నారు. ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు దిల్లీలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు.ప్రధాని మోదీ ప్రతిపాదించిన "హ్యూమన్-సెంట్రిక్ ఏఐ" విజన్‌ను ప్రపంచ దేశాలు స్వీకరించాయని కేంద్ర మంత్రి వివరించారు. ఏఐ సాంకేతికత ప్రయోజనాలు కేవలం కొద్ది దేశాలకు లేదా సంస్థలకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలకు అందేలా చేయాలని అన్ని దేశాలు అంగీకరించాయని ఆయన తెలిపారు. భారతీయ సంస్కృతిలో మూల సూత్రమైన 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అనే మంత్రాన్ని ఏఐ టెక్నాలజీ అమలులో అంతర్జాతీయ సూత్రంగా ఈ సదస్సు గుర్తించించినట్లు చెప్పారు. అమెరికా, చైనా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, ఇటలీ, ఇజ్రాయెల్, జర్మనీ, సింగపూర్, దక్షిణ కొరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఉక్రెయిన్, యూరోపియన్ యూనియన్, వంటి దేశాలు ఈ డిక్లరేషన్‌పై సంతకాలు చేశాయి. పొరుగు దేశాలైన నేపాల్, శ్రీలంక, భూటాన్ కూడా ఇందులో భాగస్వాములయ్యాయి."దిల్లీలో జరిగిన 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' అంతర్జాతీయ సహకారంలో ఒక మైలురాయిని అధిగమించింది. 'దిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్' ఏకగ్రీవ ఆమోదంతో ముగిసింది. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని వినియోగించుకోవడంలో అంతర్జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం కుదిరింది. మొత్తం 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు ఈ డిక్లరేషన్‌ను ఆమోదించాయి."- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ప్రపంచ దేశాలన్నీ ఏకగ్రీవంగా భారత్ పక్షాన నిలవడం గర్వకారణంగా ఉందని మంత్రి తెలిపారు. ఏఐ వనరులను కేవలం కొన్ని ధనిక దేశాలు లేదా కొన్ని కార్పొరేట్ సంస్థలకే పరిమితం చేయకుండా, వాటిని ప్రజాస్వామ్యబద్ధం చేయాలని తాము కోరినట్లు చెప్పారు. ఈ సాంకేతికత ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి, ప్రపంచంలోని ప్రతి మూలకు చేరాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ దార్శనికతను ప్రపంచం ఇప్పుడు అధికారికంగా ఆమోదించిందన్నారు.గ్లోబల్ సౌత్ నుంచి తొలి అడుగుఏఐ సాంకేతికతపై సాధారణంగా అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల్లోనే చర్చలు జరుగుతుంటాయి. అయితే, గ్లోబల్ సౌత్ నుంచి ఇటువంటి భారీ ఏఐ సదస్సును నిర్వహించిన ఘనత భారత్‌కు దక్కింది. అభివృద్ధి చెందుతున్న దేశాల అవసరాలను, అక్కడ ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఏఐ పాలన, భద్రత వంటి అంశాలపై దిల్లీ వేదికగా విస్తృతమైన చర్చలు జరిగాయి. ఈ సదస్సు కేవలం ఆయా దేశాల ప్రభుత్వాలే కాకుండా, ప్రపంచ ప్రసిద్ధ టెక్నాలజీ కంపెనీల నిపుణులు, ఇన్నోవేటర్లు, సివిల్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు. భారతదేశం నుంచి స్టార్టప్ వ్యవస్థాపకులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించి, భారతీయ మేధాశక్తిని ప్రపంచానికి పరిచయం చేశారు.ఏఐ సదస్సులో ప్రధానంగా చర్చించిన అంశాలు ఇవే!ఏఐ వల్ల తలెత్తే ముప్పులను ఎలా అరికట్టాలి? డీప్ ఫేక్స్ వంటి సమస్యలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై సభ్య దేశాలు ఒక అవగాహనకు వచ్చాయి.విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి రంగాల్లో ఏఐని సామాన్యుడికి ఉపయోగపడేలా ఎలా మార్చాలి అనే అంశంపై దృష్టి సారించారు.ఏఐ రాకతో ఉపాధి కోల్పోయే ప్రమాదం లేకుండా, ప్రజలకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఎలా అందించాలి అనే దానిపై రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు.ఏఐ అల్గారిథమ్స్ పారదర్శకంగా ఉండాలని, ఎటువంటి వివక్షకు తావు ఇవ్వకూడదని డిక్లరేషన్‌లో స్పష్టం .

# ఈపీఎఫ్ఓ ఖాతాదారులకు గుడ్‌న్యూస్

**ఇక డబ్బులు విత్ డ్రా త్వరలోనే కొత్త యాప్**

**ఈపీఎఫ్ఓ కీలక నిర్ణయం**

**యుపీఐ ద్వారా నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి డబ్బులు**

**క్లెయిమ్ దరఖాస్తుల బెడద ఇక ఉండదు**

**కొత్త మొబైల్ యాప్ ట్రయల్స్ షురూ**

**ఏప్రిల్ నుంచి అందుబాటులోకి**




దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఉద్యోగులకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) శుభవార్త చెప్పింది. అత్యవసర సమయాల్లో పీఎఫ్ డబ్బులు తీసుకోవడానికి రోజుల తరబడి ఎదురుచూసే పని లేకుండా, ఇకపై క్షణాల్లోనే డబ్బును విత్‌డ్రా చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తేనుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కొత్తగా రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా, 'యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్' సాయంతో పీఎఫ్ సభ్యులు తమ డబ్బును నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ చేసుకోవచ్చు.సరికొత్త యాప్, అద్భుతమైన ఫీచర్లుప్రస్తుతం పీఎఫ్ సేవలు ఉమాంగ్ యాప్ లేదా యూఏఎన్ పోర్టల్ ద్వారా అందుతున్నాయి. కానీ రాబోయే కొత్త యాప్ పూర్తిగా దీనికోసమే ప్రత్యేకంగా ఉంటుంది. ఈ యాప్‌లో సభ్యులు తమ ఖాతాలో ఎంత బ్యాలెన్స్ ఉందో చూసుకోవచ్చు. అందులో ఎంత మొత్తం విత్‌డ్రా చేసుకోవడానికి అర్హత ఉందో స్పష్టంగా కనిపిస్తుంది. బ్యాంక్ ఖాతాకు లింక్ అయిన యూపీఐ పిన్ ఉపయోగించి, సురక్షితంగా ఆ డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. పాస్‌బుక్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం, ఇతర సేవలు కూడా ఇందులో మరింత సులభంగా ఉంటాయి. పాత పద్ధతిలో క్లెయిమ్ ఫారం నింపి, అప్లై చేసే తిప్పలు తప్పుతాయి.ట్రయల్స్ మొదలయ్యాయిఈ కొత్త విధానం ఎలా పనిచేస్తుందో పరీక్షించడానికి ఈపీఎఫ్ఓ ఇప్పటికే రంగంలోకి దిగింది. సుమారు 100 డమ్మీ ఖాతాలతో ప్రస్తుతం ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. ఇందులో ఏవైనా సాంకేతిక లోపాలు ఉంటే సరిచేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏప్రిల్‌లో ఈ యాప్‌ను ఘనంగా ప్రారంభించేందుకు కేంద్ర కార్మిక శాఖ సన్నాహాలు చేస్తోంది.ఎంత డబ్బు తీసుకోవచ్చు అయితే పీఎఫ్ ఖాతాలోని మొత్తం డబ్బును యూపీఐ ద్వారా తీసుకునే వీలుండదు. ఖాతాలోని కొంత మొత్తాన్ని ఫ్రీజ్ చేస్తారు. అంటే అది భవిష్యత్తు అవసరాల కోసం ఉంటుంది. మిగిలిన పెద్ద మొత్తాన్ని మాత్రం సభ్యులు తమ అవసరాలకు అనుగుణంగా యూపీఐ ద్వారా వాడుకోవచ్చు. అనారోగ్యం, చదువు, పెళ్లిళ్లు, ఇళ్లు కట్టుకోవడం వంటి అత్యవసరాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.ప్రస్తుత సమస్యలుఇప్పుడున్న విధానంలో పీఎఫ్ డబ్బులు రావాలంటే క్లెయిమ్ అప్లై చేయాలి. అది ప్రాసెస్ అయ్యి డబ్బులు రావడానికి సమయం పడుతుంది. ఏటా సుమారు 5 కోట్ల క్లెయిమ్స్ వస్తున్నాయి. వీటిని పరిష్కరించడం ఈపీఎఫ్ఓకు పెద్ద భారం. ఈ టైమ్ టేకింగ్ ప్రాసెస్‌ను తగ్గించడానికే కొత్త యాప్‌ను తెస్తున్నారు. దీనివల్ల సభ్యులకు సమయం ఆదా అవుతుంది, అధికారులకు పని భారం తగ్గుతుంది.ఆటో సెటిల్మెంట్ మోడ్ఇప్పటికే ఈపీఎఫ్ఓ ఆటో సెటిల్మెంట్ మోడ్ ద్వారా సేవలను వేగవంతం చేసింది. దీని ద్వారా మాన్యువల్ ప్రమేయం లేకుండానే కంప్యూటర్ ద్వారా 3 రోజుల్లో క్లెయిమ్స్ పరిష్కారం అవుతున్నాయి. గతంలో దీని పరిమితి రూ.1 లక్షగా ఉండేది. ఇప్పుడు దాన్ని రూ.5 లక్షలకు పెంచారు. కోవిడ్ సమయంలో ప్రవేశపెట్టిన ఈ విధానం ఇప్పుడు ఎంతో మందికి ఆసరాగా నిలుస్తోంది.బ్యాంకులతో పోటీగా ఈపీఎఫ్ఓకు బ్యాంకింగ్ లైసెన్స్ లేదు కాబట్టి నేరుగా ఏటీఎంలా డబ్బులు ఇవ్వలేదు. కానీ ప్రభుత్వం మాత్రం ఈపీఎఫ్ఓ సేవలను బ్యాంకుల స్థాయికి తీసుకురావాలని భావిస్తోంది. అందులో భాగంగానే ఈ యూపీఐ ఆధారిత విత్‌డ్రాయల్ సౌకర్యాన్ని తీసుకొస్తోంది. దేశంలోని దాదాపు 8 కోట్ల మంది పీఎఫ్ సభ్యులకు ఇది నిజంగానే ఒక శుభవార్త అని చెప్పవచ్చని సంబంధిత వర్గాలు.

RNI TGTEL/25/A5065

## ముంబైలో 'లెన్స్ అండ్ లెగసీ' ఎగ్జిబిషన్.. ధర్మేంద్ర జ్ఞాపకాలతో హేమ మాలిని భావోద్వేగం



భారతీయ చలనచిత్ర రంగానికి చెందిన అరుదైన దృశ్యాలను ప్రదర్శించే 'లెన్స్ అండ్ లెగసీ: బాలీవుడ్ ఇన్ ఫోకస్' ఎగ్జిబిషన్ ముంబైలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్లో ఘనంగా ప్రారంభమైంది. కేంద్ర సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనను బాలీవుడ్ సీనియర్ నటి హేమ మాలిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దివంగత నటుడు ధర్మేంద్ర, గాన కోకిల ఆశా భోంస్లేలకు నివాళిగా ఏర్పాటు చేసిన ప్రత్యేక 'ట్రిబ్యూట్ వాల్స్' అందరినీ ఆకట్టుకున్నాయి. వారి సినీ ప్రయాణానికి సంబంధించిన అరుదైన ఫోటోలు, జ్ఞాపకాలు సందర్శకులను భావోద్వేగానికి గురి చేశాయి. వేదికపై మాట్లాడిన హేమ మాలిని తన భర్త ధర్మేంద్రను స్మరించుకుంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఆయనతో గడిపిన ప్రతి క్షణం నాకు ఎంతో విలువైనది. ఆయన ఇక లేరనే నిజాన్ని ఇప్పటికీ అంగీకరించలేకపోతున్నానులంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన జీవితాన్ని ఆయన లేకుండా ఎలా గడపాలో అర్థం కావడం లేదని కూడా తెలిపారు. ధర్మేంద్ర గురించి మాట్లాడుతూ, ఆయన కేవలం గొప్ప నటుడే కాకుండా, కెమెరా వెనుక కూడా ఎంతో కష్టపడి పనిచేసేవారని హేమ మాలిని కొనియాడారు. సినిమా అనేది హృదయాలను కలిపే వారధి అని ఆయన తరచూ చెప్పేవారని గుర్తుచేశారు. బాలీవుడ్లో 'హీ-మ్యాన్'గా గుర్తింపు పొందిన ధర్మేంద్ర, యాక్షన్, కామెడీ, భావోద్వేగ పాత్రల్లో సమానంగా రాణించిన నటుడిగా ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ఆయన నటన శైలి అద్వితీయమని హేమ మాలిని పేర్కొన్నారు. ఇదే కార్యక్రమంలో గాన కోకిల ఆశా భోంస్లేను కూడా స్మరించారు. తన సినీ కెరీర్లో లతా మంగేష్కర్, ఆశా భోంస్లే గాత్రాలు తన పాత్రలకు ప్రాణం పోశాయని హేమ తెలిపారు. "అద్భుతమైన గాయనిని మనం కోల్పోయాం. ఆమె గాత్రం ఎప్పటికీ చిరస్థాయిగా నిలుస్తుంది" అని అన్నారు. ఈ ఎగ్జిబిషన్లో ప్రముఖ ఫోటో జర్నలిస్టులు ప్రదీప్ చంద్ర, శాంతను దాస్ తీసిన అరుదైన ఛాయాచిత్రాలు ప్రదర్శించబడ్డాయి. కార్యక్రమానికి వెటరన్ నటుడు రంజిత్, పూనమ్ సిన్హా, మధు, ప్రముఖ ఫోటోగ్రాఫర్ అవినాష్ గోవారికర్ తదితరులు హాజరై పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.




## 'అరేయ్ ఆపండ్రా' రిలీజ్ డేట్ ఫిక్స్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని పుట్టినరోజును పురస్కరించుకుని, మే 15న "అరేయ్ ఆపండ్రా" చిత్రం గ్రాండ్గా థియేటర్లలో విడుదల కానుంది. క్రియేటివ్ థింక్స్ గ్యాంగ్ బ్యానర్పై బేబీ హరిణి సమర్పణలో, తల్లాడ సాయి కృష్ణ దర్శకత్వంలో అశోక్ నిమ్మల ఈ కామెడీ సస్పెన్స్ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మీడియాతో ముచ్చటించి సినిమా విశేషాలను పంచుకుంది. నిర్మాత అశోక్ నిమ్మల మాట్లాడుతూ, "ఈ వేసవిలో ప్రేక్షకులకు కడుపుబ్బ నవ్వించే ఒక అద్భుతమైన చిత్రాన్ని అందించబోతున్నాం. అనుకున్న బడ్జెట్లో మా దర్శకుడు సినిమాను చాలా రిచ్గా తెరకెక్కించారు. సుదర్శన్, భద్రం, తల్లాడ సాయికృష్ణల నటన సినిమాకు ప్రధాన ఆకర్షణ" అని తెలిపారు. సహ నిర్మాత వెంకట్ దుగ్గిరెడ్డి మాట్లాడుతూ.. ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాలతో పాటు అమెరికాలో కూడా భారీగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. మరో సహ నిర్మాత అంజాద్ మాట్లాడుతూ షూటింగ్ ఖమ్మం, హైదరాబాద్ పరిసరాల్లో జరిగిందని, అవుట్పుట్ అద్భుతంగా వచ్చిందని ధీమా వ్యక్తం చేశారు.

నాచురల్ కామెడీతో పాటు మంచి సందేశం

దర్శక-నటుడు తల్లాడ సాయి కృష్ణ మాట్లాడుతూ.. "నేటి సామాజిక పరిస్థితులను సహజమైన కామెడీతో జోడించి, ఒక మంచి సందేశంతో ఈ సినిమాను రూపొందించాం. మా లాంటి యంగ్ ఫిల్మ్ మేకర్స్కి రామ్ అన్న పెద్ద ఇన్స్పిరేషన్. ఆయన పుట్టినరోజున సినిమాను విడుదల చేయడం సంతోషంగా ఉంది. అలాగే 'ఒంగోలు గిత్త'లో రామ్ అన్నతో నటించిన కిషోర్ దాస్ గారు మా సినిమాలో ఉండటం మాకు పెద్ద ప్లస్" అని అన్నారు.

## బాహుబలి-2 రికార్డ్ బ్రేక్.. ఇంకా ఎన్ని కోట్లు కావాలంటే?




రణ్వీర్ సింగ్ హీరోగా వచ్చిన స్పై థ్రిల్లర్ మూవీ దురంధర్-2. మార్చి 19న థియేటర్లలో రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ను షేక్ చేసింది. ఇండియన్ సినీ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన మూవీస్ జాబితాలో మూడోస్థానంలో నిలిచింది. ఈ మూవీ రిలీజై 43 రోజులైనా వసూళ్లు సాధిస్తూనే ఉంది. ఇప్పటికే పుష్ప-2 రికార్డ్ బద్దలు కొట్టిన దురంధర్-2 మరో క్రేజీ రికార్డ్పై కన్నేసింది. ఇప్పటి వరకు దురంధర్-2 ప్రపంచవ్యాప్తంగా రూ. 1,783.66 కోట్ల వసూళ్లు సాధించింది. దేశవ్యాప్తంగా రూ. 1358.51 కోట్ల గ్రాస్ సాధించిన ఈ చిత్రం.. ఓవర్సీస్లో రూ. 425.15 కోట్లకు పైగా వసూలు చేసింది. ప్రస్తుతం థియేటర్లలో రన్ అవుతోన్న ఈ మూవీ బాహుబలి-2 రికార్డ్కు ?అత్యంత చేరువలో ఉంది. రాజమౌళి బాహుబలి-2 కంటే కేవలం రూ. 5 కోట్లు మాత్రమే వెనకబడి ఉంది. రాబోయే రోజుల్లో ఇదే వసూళ్లు కొనసాగితే బాహుబలి-2ను సైతం అధిగమించేలా కనిపిస్తోంది. ఈ సినిమా ఆరో వారంలో రూ.12.40 కోట్ల వసూళ్లు రాబట్టింది. గతేడాది రిలీజైన దురంధర్కు సీక్వెల్గా ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఆదిత్య ధర్ రచన, దర్శకత్వం వహించగా.. రణవీర్ సింగ్ కీలక పాత్రలో నటించారు. ఈ చిత్రంలో రాకేష్ బేడి, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, గౌరవ్ గెరా, డానిష్ పాండోర్, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో కనిపించారు.

## 'పెద్ది'లో శృతి హాసన్ స్పెషల్ సాంగ్

### ఒక్క పాటకే అన్ని కోట్ల రెమ్యునరేషన్ తీసుకుందా?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సాన కాంబినేషన్లో తెరకెక్కుతున్న పెద్దిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఉత్తరాంధ్ర నేపథ్యంతో రూపొందుతున్న ఈ స్పోర్ట్స్ డ్రామా గురించి మరో ఆసక్తికరమైన వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్గా మారింది. ఈ సినిమాలో ఒక స్పెషల్ మాస్ సాంగ్ కోసం గ్లామర్ స్టార్ శృతి హాసన్ని ఎంపిక చేసినట్లు సమాచారం. అయితే ఈ పాట కోసం ఆమె తీసుకుంటున్న పారితోషికం మరింత సంచలనంగా మారింది. సాధారణంగా హీరోయిన్గా చేస్తే ఆమె దాదాపు రూ.3 కోట్ల లోపు రెమ్యునరేషన్ తీసుకుంటారని తెలిసినా, 'పెద్ది'లో కేవలం ఒకే ఒక్క పాట కోసం రూ.3.5 కోట్ల వరకు తీసుకుంటున్నట్లు ఇండస్ట్రీ టాక్. హీరోయిన్గా ఒక సినిమాకు నెల రోజుల వరకు కాల్షీట్లు ఇవ్వాల్సి ఉండగా, స్పెషల్ సాంగ్ కోసం కేవలం 4-5 రోజుల్లో షూటింగ్ పూర్తవుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ రెమ్యునరేషన్ అందుకోవడం వల్ల ఇది శృతి హాసన్కు 'బంపర్ ఆఫర్'గా భావిస్తున్నారు సినీ విశ్లేషకులు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, గతంలో రామ్ చరణ్ -- శృతి హాసన్ కలిసి నటించిన ఎవడు బ్లాక్బస్టర్ హిట్ సాధించింది. అదే సెంటిమెంట్ను దృష్టిలో పెట్టుకుని ఈ పాట కోసం చరణ్ స్వయంగా శృతిని సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్కు శృతి హాసన్ గ్లామర్ తోడైతే ఈ పాట థియేటర్లలో హైలైట్గా నిలుస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. ఈ స్పెషల్ సాంగ్కు సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారని సమాచారం. ఉత్తరాంధ్ర యాసలో సాగే పక్కా మాస్ నంబర్గా ఈ పాట రూపొందుతోందని తెలుస్తోంది. హైదరాబాద్ సమీపంలోని జన్వాడలో వేసిన భారీ సెట్లో ప్రస్తుతం ఈ పాట చిత్రీకరణ జరుగుతోందని టాక్. గతంలో తమన్నా భాటియా, పూజా హెగ్డే వంటి స్టార్ హీరోయిన్లు స్పెషల్ సాంగ్స్ కోసం భారీ పారితోషికాలు తీసుకున్నారు. ఇప్పుడు శృతి హాసన్ వారిని మించి టాలీవుడ్లో అత్యంత ఖరీదైన స్పెషల్ సాంగ్ చేసిన నటిగా నిలిచే అవకాశం కనిపిస్తోంది. అధికారిక ప్రకటన రాకపోయినా, ఈ సినిమా జూన్లో విడుదలకు సిద్ధమవుతోందని సమాచారం. ఒకే పాటతో ఇంతటి చర్చ జరగడం 'పెద్ది' సినిమాపై ఉన్న క్రేజ్కు నిదర్శనంగా భావిస్తున్నారు సినీ వర్గాలు



## రామ్ చరణ్ పెద్ది.. కొత్త రిలీజ్ డేట్ ఇదే

మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న పెద్ది మూవీ రిలీజ్ డేట్ వచ్చేసింది. ఈ మూవీని జూన్లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని ఇప్పటికే ప్రకటించారు. తాజాగా ఇవాళ విడుదల తేదీని రివీల్ చేశారు మేకర్స్. ఈ చిత్రాన్ని జూన్ 4న రిలీజ్ చేయనున్నట్లు అఫీషియల్గా వెల్లడించారు. దీంతో కాస్త ముందుగానే పెద్దిని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాకు ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్గా కనిపించనుంది. ఈ మూవీలోని ఐటమ్ సాంగ్లో కోలీవుడ్ భామ శృతిహాసన్ కనిపించనుంది. ఇప్పటికే ఈ సాంగ్ షూట్ కూడా పూర్తయింది. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన పెద్దిని ఎట్టకేలకు జూన్ 4న బిగ్ స్క్రీన్పైకి తీసుకొస్తున్నారు. దీంతో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తోన్న మెగా ఫ్యాన్స్కు గుడ్ న్యూస్ వచ్చేసింది. ఈ మూవీకి ఏఆర్ రెహమాన్ సంగీతమందించారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.